S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సంపుటి: 18 | సంచిక: 366 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

# ముంచుకొస్తున్న వాయుగుండం

## తెలంగాణకు భారీ నుంచి అతిభారీ వర్షాలు

తెలంగాణలో భారీ వర్షాల ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆల్పా పీడనం వల్ల ఈ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. 29వ తేదీ వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

- 29 వరకు నాలుగు రోజుల పాటు వానలు
- బంగాళఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షం
- ములుగు జిల్లాలో ఎడతెరిపిలేని వాన



# కలెక్టర్లు బీఅలర్ట్

- ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షించండి
- ముంపు బాధితులను ముందే రెస్క్యూ చేయండి
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :** తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు-ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్ వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు.

మిగతా 2 లో

## అంగన్‌వాడీలకు దసరా సెలవులు

తొలిసారి 8 రోజుల పాటు మంజూరు

02







# నేటి నుంచే మద్యం టెండర్లు

3

- లిక్కర్ షాపులకు దరఖాస్తులు
- ఒక్కో అప్లికేషన్‌కు రూ.3లక్షల రుసుం
- అక్టోబర్18 వరకు అవకాశం
- మార్గదర్శకాలు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ



తెలంగాణలో కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైంది. నేటి(శుక్రవారం) నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న డ్రా పద్ధతిలో మద్యం షాపులు కేటాయించను న్నారు. కొత్త షాపులకు 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితిగా నిర్ణయించారు. అలాగే టెండర్ ఫీజును రూ.3 లక్షలుగా నిర్ణయించారు. గతంలో టెండర్ ఫీజు 2 లక్షలు ఉండగా.. ఇప్పుడు ఒక లక్ష అదనంగా పెంచుతూ మూడు లక్షలుగా తేల్చారు. అలాగే ఫీజు మొత్తాన్ని ఒకేసారి కాకుండా ఆరు విడతలుగా చెల్లించే వెసులుబాటు కల్పించారు.



# అత్యాధునిక వసతి సముదాయం

- తిరుమలలో ప్రారంభించిన ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి
- రూ.102కోట్లతో నూతన కాంప్లెక్స్
- ఏక కాలంలో నాలుగువేల మందికి వసతి సౌకర్యం
- కల్యాణకట్ట, రెండు డైనింగ్ హాళ్లు అందుబాటులోకి..

**తిరుమల :** తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మరో అత్యాధునిక వసతి సముదాయం ప్రారంభమైంది. వేంకటాద్రి నిలయం యాత్రికుల వసతి సముదాయంను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు కలిసి ప్రారంభించారు. ముందస్తు బుకింగ్ లేకున్నా భక్తులకు వసతి కల్పించేలా రూ.102 కోట్లతో

మిగతా 2 లో

# తప్పులు చేసేవారిని వదలను



## నేరాలు సహించేది లేదు

- తనతో సహా అందరిపైనా రకరకాల కేసులతో వేధింపులు
- వైకాపా అరాచకానికి పరాకాష్టగా నాటి పాలన
- సింగపూర్ వారిని కూడా బెదిరించిన ఘనులు
- రాష్ట్రం నుంచి పరిశ్రమను తరలించిన గల్లా జయదేవ్
- రాష్ట్రంలో శాంతిభద్రతల రక్షణకు పెద్దపీట
- ఆడపిల్లల జోలికి వస్తే అదే చివరి రోజు కావాలి
- అసెంబ్లీలో శాంతిభద్రతలపై చర్చలో సీఎం చంద్రబాబు

# ముగ్గురు బాలికలపై లైంగికదాడి

- ప్రేమ పేరుతో పరిచయం లేని యువకుల నయవంచన
- అల్వాల్ నుంచి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి దారుణం
- చివరకు పోక్సో కింద జైలుకు



.. వివరాలు 2లో



02

## దేవాదాయ భూములను రక్షించండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన మంత్రి కొండా సురేఖ

## ఏ ఒక్కరూ సంతోషంగా లేరు

03



అంగన్‌వాడీ పట్ల కర్కశంగా ఉండటం కరెక్టు కాదు : హరీశ్‌రావు



02

- 563 మందికి నియామకపత్రాలు
- అందించనున్న సీఎం రేవంత్ రెడ్డి

## గ్రూప్-1 విజేతలకు రేపు ఆర్డర్లు




## అంగన్‌వాడీలకు దసరా సెలవులు

**తొలిసారి 8 రోజుల పాటు మంజూరు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు ఎనిమిది రోజుల పాటు దసరా సెలవులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల చరిత్రలో తొలిసారిగా దసరా సెలవులు ఇవ్వడం ఇదే ప్రథమం. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే దసరా, బతుకమ్మ పండగలు జరుపుకునే విధంగా దసరా సెలవులు మంజూరు చేయాలని ఐఎన్టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి.అన్నపూర్ణ, ఇతర ప్రతినిధుల బృందం మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కలిసి ఇటీవల విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సీతక్క సెలవులు మంజూరు చేయించారు. ఈ మేరకు 27 నుంచి అక్టోబర్ 4 వరకు దసరా సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు యధావిధిగా పోషకాహారాన్ని అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీలకు సెలవులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కృతజ్ఞతలు తెలిపారు. 8 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు మూసి ఉండనున్నాయి.

## స్మితాసబర్వాల్‌కు హైకోర్టులో ఊరట

**ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఘోష్ కమిషన్ నివేదికపై పలువురు ఇప్పటికే కోర్టు మెట్లు ఎక్కారు. ఈనేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ హైకోర్టును ఆశ్రయించగా ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక అమలును నిలిపివేయాలంటూ స్మితా సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఘోష్ కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దు.. స్మితా సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక అమలును నిలిపివేయాలంటూ స్మితా సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. స్మితా సభర్వాల్ గత ప్రభుత్వ హయాంలో సీఎంవోలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు. ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలివ్వాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తనను సాక్షిగా పిలిచిందని, అయితే తనపై ఆరోపణలు చేసే ముందు చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. విచారణ కమిషన్ చట్టం-1952లోని 8బీ, 8సీ సెక్షన్ల ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలన్న నిబంధనలను కమిషన్ అమలు చేయలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారిగా ఆ నిర్మాణ పురోగతిని సమీక్షించానని తెలిపారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి హోదాలో మూడు బ్యారేజీల నిర్మాణ స్థలాలను కూడా సందర్శించినట్టుగా కమిషన్ నివేదికలో ఉన్నదని పేర్కొన్నారు. మేడిగడ్డ, అ న్నారం, సుందిల్ల బ్యారేజీల నిర్మాణానికి పరిపాలనా అనుమతి, ఆమోదాల మంజూరులో తన ప్రమేయం లేదని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చిన సాక్షులను విచారించే అవకాశం కూడా కల్పించకపోవడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తన పాత్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు లోబడి ఉన్నదని తెలిపారు. క్యాబినెట్ ఎదుట ఫైళ్లు ఉంచలేదు కాబట్టి చర్యలు తీసుకోవాలని కమిషన్ పేర్కొనడం చెల్లదని తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటే తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. నివేదిక రద్దు చేయాలనని, తుది ఉత్తర్వులు వెలువరించే వరకు నివేదిక అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

## సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఈడీ ఎంటర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** సరోగసి పేరుతో పిల్లల ట్రాఫికింగ్‌కు పాల్పడిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రవేశించింది. హైదరాబాద్ పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు ఫైల్ చేసింది. సంతానం లేని దంపతుల నుంచి సరోగసి పేరుతో డాక్టర్ నమత్ర భారీగా నగదు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆమెను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. అబార్షన్ కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు నగదు ఆశ చూపి ప్రసవం తర్వాత వారి పిల్లల్ని డాక్టర్ నమ్రత కొనుగోలు చేసేవారు. అనంతరం సరోగసి ద్వారా పుట్టిన బిడ్డగా పిల్లలు లేని దంపతులను నమ్మించి పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారు. నాలుగేండ్లలో దాదాపు రూ.500 కోట్ల వరకు లావాదేవీలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. సికింద్రాబాద్‌తోపాటు విశాఖపట్నంలో ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసిన డాక్టర్ నమత్ర.. ఏజెంట్ల సాయంతో గర్భస్రావం చేయించుకోవాలని దవాఖానకు వచ్చే పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ దందా కొనసాగించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ నమ్రతను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

## భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు ప్రభుత్వం గుర్తింపు

**708 మంది ఎఫ్‌టీఎస్‌లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** దసరా నవరాత్రుల వేళ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు ఉద్యోగులకు దసరా కానుక ప్రకటించింది. అందులో భాగంగా రాష్ట్రంలో భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో 708 మంది ఎఫ్‌టీఎస్‌లను టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే ఆ యా ఉద్యోగుల జీతాలు పెంచుతూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొనగాల మహేష్ స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ముంచుకొస్తున్న వాయుగుండం

**29 వరకు నాలుగు రోజుల పాటు వానలు**

**బంగాళఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం**

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక**

**గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షం**

**ములుగు జిల్లాలో ఎడతెరిపిలేని వాన**



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఉందని పేర్కొంది. రాగల 24గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు-మధ్య దానికి ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 26వ తేదీ వరకు పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. 27వ తేదీ నాటికి తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఏపీ, తెలంగాణ మీదుగా సముద్రమట్టానికి ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నారాయణపేట, నారాయణపేట జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, శని-ఆదివారాల్లోనూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇదిలావుంటే ములుగు జిల్లాల్లో వర్షం దంచి కొట్టింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడుతున్నది. జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరు నాగారం, తాడ్వాయి, ములుగు, గోవిందరావుపేట, మల్లంపల్లి మండలాల్లో ఆగకుండా వాన కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. లోతట్టు- ప్రాంతాలు జలమయ మయ్యాయి. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వానలు పడుతాయని తెలిపింది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని పేర్కొంది. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇక శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## గ్రూప్-1 విజేతలకు రేపు ఆర్డర్లు

**563 మందికి నియామకపత్రాలు • అందించనున్న సీఎం • సీఎస్ వెల్లడి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్ -1 అభ్యర్థులకు ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. శనివారం సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నత అధికారులతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ద్వారా ఎంపికైన 563 మంది అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందిస్తారని సీఎస్ తెలిపారు. దాదాపు 18 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర మంత్రులందరినీ కూడా ఆహ్వానిస్తున్నట్టు సీఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవిన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు- పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి హార్థిక ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని, ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్లు బీ అలర్ట్

మొదటి పేజీ తరువాయి

విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు-, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇదిలావుంటే హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షం మొదలైంది. గురువారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, ప్యాటీ--÷--న, పారడైజ్, సికింద్రాబాద్, కోఠి, అబిడ్స్, చాదర్ ఘట్, మలక్ పేట్ తదితర ప్రాంతాల్లో వాన పడింది. గత వారం రోజులుగా అకాశమంతా మబ్బులుగా ఉంటూ అక్కడక్కడ వర్షం కురుస్తోంది. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చిరికలు జారీ చేసింది. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి వర్షాలపై స్పందించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని జిల్లా కలెక్టర్లకు సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## దేవాదాయ శాఖ భూములను రక్షించండి

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన మంత్రి సురేఖ**

**హైదరాబాద్,సెప్టెంబర్25 :** దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా సాయం చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిక్షించేందుకు ఇప్పటికే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. మంత్రి కొండా సురేఖతో గురువారం సచివాయలంలోని మంత్రి చాంబర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ బతుకమ్మ కుంట పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంత్రి అభినందించారు. బతుకమ్మ కుంట పునరుద్దరణ విజయంతంగా పూర్తి చేసినందుకు శభాష్ అంటూ కితాబు ఇచ్చారు. అయితే, తన పరిధిలో ఉన్న దేవాదాయ శాఖలోని భూముల పరిరక్షణకు హైడ్రా సాయం అవసరమని మంత్రి గుర్తు చేయగా ముఖ్యమంత్రి అనుమతితో చర్యలు తీసుకుంటామని రంగనాథ్ వివరణ ఇచ్చారు. అందుకోసం ప్రభుత్వ పరంగా శాఖ పరంగా కావాల్సిన సాంకేతిక అంశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. హైడ్రా వచ్చాక చేపట్టిన పనుల వివరాలను రంగనాథ్ మంత్రికి సమగ్రంగా వివరించారు. అయితే, మంచి పనులు చేసే సందర్భంగా కొన్ని ఇబ్బందులు ఎదరవుతాయని అన్నారు. కానీ సామూహిక ప్రయోజనంలో భాగంగా చేశారని మంత్రి సురేఖ కొనియాడారు. హైడ్రా చేస్తున్న పనులు రానున్న కాలంలో అందరికీ తెలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వరంగల్ నాలాల ఆక్రమణలను కూడా రంగనాథ్‌తో చర్చించారు. వాటిని పరిష్కరించేందుకు తమకు సహకరించాలని కోరారు. అందుకు ఆయన సుముఖత తెలిపారు. కాగా, బతుకమ్మ కుంట వేడుకలకు మంత్రి సురేఖను రంగనాథ్ ఈ సందర్భంగా ఆహ్వానించారు.



## ముగ్గురు బాలికలపై లైంగికదాడి

**ప్రేమ పేరుతో పరిచయం లేని యువకుల నయవంచన**

**అల్వాల్ నుంచి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి దారుణం**

**చివరకు పోక్సో కింద జైలుకు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** హైదరాబాద్‌లో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో ముగ్గురు బాలికలకు మాయమాటలు చెప్పి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్వాల్‌కు చెందిన 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు, పాఠశాలలో బతుకమ్మ వేడుకలున్నాయని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లారు. అయితే సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో బాలికలు తార్నాక ప్రాంతంలో తిరుగుతుండగా, అక్కడే ముగ్గురు యువకులు వారిని ప్రేమిస్తున్నామని నమ్మించారు. నిందితులు జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి మధు (19), ఒక షాపింగ్ మాల్లో పనిచేసే వంశీ (22), అలాగే పెట్రోల్ బంక్ ఉద్యోగి నీరజ్ (21)గా పోలీసులు గుర్తించారు. వీరు ముగ్గురు బాలికలను తన మాటలతో నమ్మబలికి, యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. తరువాత సాయంత్రం తార్నాకకు తిరిగి వచ్చిన బాలికలు తీవ్ర షాక్‌లో ఏడుస్తూ తమ తల్లిదండ్రులకు వివరాలు తెలియజేశారు. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించి, అత్యాచారం జరిగినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం మధు, వంశీ, నీరజ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మైనర్ బాలికలపై ఇటువంటి ఘటనలు పెరుగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కఠిన చర్యలతోనే ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

- రూ.30 వేల కోట్లతో రోడ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం
- రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ఫోబియా పట్టుకుందని విమర్శలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి సరైన అడుగులు పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాలతో తెలంగాణకు జాతీయ రహదారులు అనుసంధానం అయ్యాయని, జాతీయ రహదారుల నిర్వహణ వల్ల దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలియజేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణ రహదారులపై చర్చించానని, రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారులకు నిర్మాణం చేపట్టాం అని పేర్కొన్నారు. రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు చేశామని, రూ.30 వేల కోట్లకు పైగా నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా.. తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందువరసలో నేనుంటాను.. మా మంత్రిత్వ శాఖలో.. తెలంగాణ ప్రాజెక్టుల కోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మేం ప్రొయాక్టివ్ గా వ్యవహరించామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.. మెట్రో విషయంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.. ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నప్పుడు.. చాలా విషయాలపై స్పష్టత కావాలని అడుగుతారు.. మెట్రో విషయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసినపుడు.. వారు చాలా స్పష్టంగా చెప్పారు.. ఇప్పుడు మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి కొత్తగా నిర్మాణం చేపట్టనున్న కంపెనీ మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా అని ప్రశ్నించారు.. కాళేశ్వరం పై సీబీఐ ప్రతిపాదనలు అందాయని పరిశీలనలో ఉందని తెలిపారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు బీజేపీ ఫోబియా పట్టుకుంది... రెండు పార్టీలు అర్థం పర్థం లేకుండా, ఆధారాల్లేకుండా.. మాట్లాడుతున్నారు. మీరు మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. బీసీ రిజర్వేషన్ పెరగాలని అసెంబ్లీలో మద్దతిచ్చాం.. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా.. 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఇదే సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ప్రతి ఒక్కరూ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల నేతలు విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. వాళ్లకు బిజెపి ఫోబియా పట్టుకుందన్నారు. చిల్లర మాటలు, అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. బిజెపికి తెలంగాణలో ఎవరితో కలవాల్సిన అవసరం లేదన్నారు. కెసిఆర్, కేటీఆర్, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బిజెపి ఎప్పుడు కలవదని స్పష్టం చేశారు. కలిసి కాపురాలు చేసింది మీరు.. ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంది మీరు.. మంత్రి పదవులు పంచుకుంది మీరు.. బిజెపికి ఎటువంటి అవసరం లేదని ఫైర్ అయ్యారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా స్వతంత్రంగా పోటీ- చేస్తాం.. టిఆర్ఎస్, కాంగ్రెస్లకు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చేందుకే మా ప్రయత్నం చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వ్యవహారశైలి సమంజసంగా లేదు. జెన్ జీ విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలు.. నేపాల్ లో జరిగినట్లుగా.. పీఎం ఇంటిపైనా, మంత్రుల ఇంటిపైనా.. న్యాయస్థానాలపైనా దాడులు జరిగినట్లుగా.. ఇక్కడ జరగాలని కేటీఆర్ భావిస్తున్నారా? బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఇక్కడ అమలవుతోంది.. దేశంలో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. అభివృద్ధి వేగవంతంగా సాగుతోంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే.. మనం వేగంగా పురోగతి సాధిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో.. కొందరు దివాళాకోరు మాటలు మాట్లాడం సరికాదు. ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఏ ఒక్కరూ సంతోషంగా లేరు

## అంగన్‌వాడీ పట్ల కర్కశంగా ఉండటం కరెక్టు కాదు : హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** అనేక అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అందరినీ నట్టేట ముంచుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న అంగన్‌వాడీ టీచర్లపై రేవంత్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుండటం పట్ల ధ్వజమెత్తారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రెటేరియట్ పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడిక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఉద్యోగులకు గౌరవం లేదా? గుర్తింపు లేదా? ప్రజా పాలన అని రాక్షస పాలన కొనసాగిస్తారా? ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ సంబురం లేకుండా చేస్తున్న



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారి ఉసురు తగులుతుంది అని దుయ్యబట్టారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్‌వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారు. వారి గౌరవాన్ని పెంచారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ. 13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్ని రూ.7,800లకు, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారు. మాయ మాటలు చెప్పి, 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీ లేదు, గతీ లేదు. మహాలక్ష్మి పేరిట మీరు అమలు చేస్తున్న ఉచిత బస్సుల్లోనే జిల్లాల నుంచి సచివాలయం వద్దకు వచ్చి మిమ్మల్ని నిలదీస్తున్నారు. మీ మోసపూరిత వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరెస్టులు చేసిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి

- వాటాల తేడాలు రావడంతోనే కేసీఆర్ కుటుంబంలో కల్లోలం
- ఆ పార్టీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు : మహేశ్‌కుమార్‌గౌడ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్25 :** బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఆశాభావం వ్యక్తంచేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను వంతులవారీగా పంచుకున్నారని.. ఇప్పుడు వాటాల దగ్గర తేడా రావడంతో కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో ఒక్క సామాజికవర్గానికే కాకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వేలు చేస్తున్నామని.. సర్వేలో ఎవరూ ముందుంటే వారికే సీటు ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలిచే వారికి సీటు ఇస్తామని స్పష్టం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. గురువారం ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేష్ కుమార్ గౌడ్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చాలామంది రేసులో ఉన్నారని చెప్పుకొచ్చారు. సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్ , బొంతు రామ్మోహన్‌లతో సహ పలువురు జూబ్లీహిల్స్ టికెట్ అడుగుతున్నారని గుర్తుచేశారు. స్థానికులకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని తెలిపారు. మంత్రుల



కమిటీ, సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలోకే వస్తోందని చెప్పుకొచ్చారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని గుర్తుచేశారు. గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన తెలంగాణ డీసీసీల అంశంపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు. కబ్జా చేసిన వారికే హైడ్రాతో ఇబ్బందులు. ప్రభుత్వ భూమి పోకుండా ఉండేలా హైడ్రా పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు హైడ్రా కూలగొట్టడానికి వెళ్లింది, కానీ కోర్టు ఆర్డర్ స్థానికులు తీసుకొచ్చారు ఆగిపోయింది. తన, మన భేదం లేకుండా హైడ్రా పని చేస్తోంది. పీసీసీ పాదయాత్ర సీఎం రేవంత్ రెడ్డికి, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కి తెలియకుండా చేశారని కొందరు గతంలో ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది. బీఆర్ఎస్ మళ్లీ పునర్జీవం పోసుకోదు. ఏం చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి బీజేపీ నాయకులకు ఉంటే ఒక్కరోజులో బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపొచ్చు ' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అన్నిటిపైన సీబీఐ విచారణ జరిపితే బాగుంటుంది. కవితది ఆస్తుల పంచాయితీ. కాంగ్రెస్‌తో కవితకు ఏలాంటి సంబంధం లేదు. కవితకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉంది ?. దోపిడీ చేసిన వారిని ప్రజలు ఎందుకు ఆదరిస్తారు. ఫోన్ ట్యాపింగ్ పెద్ద కేసు, అందరి వాయిస్‌లు రికార్డు చేశారు. నాది, రేవంత్‌రెడ్డిది రెండున్నరేళ్ల నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసింది. నేను వాడిన జియో సిమ్ కార్డు నెంబర్ జియోసంస్థకు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. జియో సంస్థకు రాసిన లేఖ కూడా దొరికింది. ఫోన్ ట్యాపింగ్ చేసి కేసీఆర్, కేటీఆర్ వ్యూహ రచన చేసి గత ఎన్నికల్లో గెలిచారు. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ తప్పదు.. క్లియర్ ఆధారాలు ఉన్నాయి' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.




# నేటి నుంచే మద్యం టెండర్లు

## లిక్కర్ షాపులకు దరఖాస్తులు ● ఒక్కో అప్లికేషన్‌కు రూ.3లక్షల రుసుం

## అక్టోబర్18 వరకు అవకాశం ● మార్గదర్శకాలు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇక అక్టోబర్ 23వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించనున్నారు. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు అంటే రెండేళ్ల కాలానికి అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలుగా నిర్ధారించారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయని వారు దుకాణాలు పొందేందుకు అనర్హులు. ఇక మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేశారు అధికారులు.

# స్వదేశీ వస్త్రాలనే వాడండి : ఎంపీ లక్ష్మణ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** దేశం అన్ని రంగాల్లో మరింతగా రాణించాలంటే స్వదేశీ వస్త్రాలనే ఉపయోగించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. దిన్ దయాళ్ ఉపాధ్యయ జయంతి సందర్భంగా లక్ష్మణ్ నివాళులర్పించారు. గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. దిన్ దయాళ్ ఉపాధ్యాయ ఇచ్చిన సందేశాన్ని మోదీ సాకారం చేస్తున్నారని తెలిపారు. ప్రధాని జన్ ధన్ ఖాతాలు తెరిపించి బ్యాంకులకు చేరువ చేశారని.. దిక్కు లేని వారికి మోదీ దిక్కయ్యారని చెప్పుకొచ్చారు. 4 కోట్ల మందికి ఆవాసం నిర్మించారన్నారు. మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు.. అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని ఎంపీ పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకూడదని స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని పిలుపు ఇచ్చారన్నారు. అక్టోబర్ 2న చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి.. చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో భారతదేశాన్ని అభివృద్ధిలో 4వ స్థానానికి మోదీ తీసుకువచ్చారని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ తగ్గించారని.. గొప్ప సంస్కరణ తీసుకువచ్చారని కొనియాడారు. అమెరికా లాంటి దేశాలు టారిఫ్ పేరిట ఇబ్బందులు పెడుతున్నా.. దేశంలో అనేక స్టార్టప్ సంస్థలు తీసుకువస్తున్నారని అన్నారు. సేవ పక్వడలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2047 వరకు దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వదేశీ వస్త్రాలు ఉపయోగించాలని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికలపై బిఆర్ఎస్ అప్రమత్తం

## నేతలను అలర్ట్ చేసిన వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్

## ముఖ్యనేతలతో కేటీఆర్, హరీష్ రావుల టెలి కాన్ఫరెన్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో బిఆర్ఎస్ అప్రమత్తం అయ్యింది. పార్టీ శ్రేణులను,కార్యకర్తలను అలర్ట్ చేసింది. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు- చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు- చేయలేదని, తెలంగాణ సంస్కృతి పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు- చేసేలా చూడాలని సూచించారు. అదే సందర్భంలో ప్రజలతో నిత్యం సంబంధాలు నెరుపుతూ ముందుడాలని అన్నారు.

# కొంపెల్లి వెంకట్‌గౌడ్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** తెలంగాణ సామాజిక చారిత్రక సాహితీవేత్త, ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణం సాహితి లోకానికి ఎంతో తీరని లోటని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన సంతాపం ప్రకటించారు. ప్రొఫెసర్ జయశంకర్ గారితో సంభాషణ, వొడువని ముచ్చట, పుస్తకం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనుసరించాల్సిన రాజకీయ భావజాలాన్ని వ్యాప్తిచేసిన ఉద్యమ రచయిత కొంపెల్లి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను రికార్డుచేసి వెలుగులోకి తెచ్చి, బీసీల రాజకీయ చైతన్యం కోసం పాటుపడిన ఘనత కొంపెల్లిదేనని.. వారితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణవాదిగా, బహుజన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ పలు రచనలు చేసిన వెంకట్ గౌడ్ అకాల మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. వారి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులు మిత్రులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

26-09-25 Samayam_Layout 1 9/26/2025 9:45 AM Page 4



## సంపాదకీయం



# అమెరికా ఆంక్షలకు అనుగుణంగా సాగాలి

అమెరికా అధ్యక్షుడు ట్రంపు లేపుతున్న కంపు కారణంగా ప్రపంచ దేశాలు అనేక ఇబ్బందుల్లో పడుతున్నాయి. ప్రధానంగా భారతదేశ యువత పరిస్థితి డోలాయమానంలో పడింది. ఎంఎస్, ఎంబిఎ చదువులు అక్కడే చదివి ఉద్యోగాలు పొందానల్న వారి కలలపై ట్రంప్ నీళ్లు చట్టారు. ఇటీవల హెచ్-1 బి వీసాలను వ్యాపారంగా మార్చడంతో ఇప్పుడు అమెరికా వెళ్ళి ఇక చదువుకోవడం కష్టంగా మారింది. ఇకపోతే అమెరికాలో ఉన్నత చదువులు చదివిన భారతీయలు ఉద్యోగాలు లేక అక్కడ మగ్గుతున్నారు. మన దేశంలో ఉద్యోగాలు దక్కక ఎంతోమంది విదేశాలకు వెళ్లినా వారికి భరోసా దక్కడం లేదు. అటు ఉద్యోగాలు దొరక్క..బ్యాంకు రుణాలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. పోనీ దేశానికి వచ్చి ఇక్కడేమైనా చేద్దామా అంటే ఇక్కడా పరిస్థితి దారుణంగా ఉంది. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. ఉన్న ఉద్యోగులను మెల్లగా తీసేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాలకోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారం పట్ల దృష్టిసారించాల్సిందిపోయి నిర్లిప్తంగా ఉంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ పథకాలతో రాటుదేలాయి. విద్యా,ఉపాధి రంగాలను ప్రోత్సహించడం లేదు. విదేశాలపై ఆధారపడి వద్దంటున్న ప్రధాని మోడీ ఇక్కడ ఉపాధి, ఉద్యోగ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామన్న భరోసా ఇవ్వడం లేదు. రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా పాలన సాగించడం లేదు. ఈ క్రమంలో ముందు ఆర్థిక వ్యవస్థ బలపడాలి. తరవాత స్వయం ఉపాధి పథకాలు భారీగా చేపట్టాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ దిశంగా చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. నిజానికి మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం కావాలి. కానీ అలా జరగడం లేదు. అమెరికా లాంటి దేశాలు ఆంక్షలు విధిస్తే అతలాకుతలం కావడం మినహా గత్యంతరం లేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పుడు యువత మిగతా దేశాల వైపు చూస్తోంది. ఈ క్రమంలో కేంద్రం కఠిన నిర్ణయాలతో ముందుకు రావాల్సి ఉంది. ఇకపోతే రాష్ట్రాల్లో కులవృత్తులకు ప్రోత్సాహం దక్కడంలేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేసే చర్యలు తీసుకోవడం లేదు. నిరుద్యోగులను గట్టెక్కించే చర్యలకు బదులు, పన్నుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఉద్యోగ,ఉపాధి రంగాలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. డాలర్ బలపడుతుందే తప్ప రూపాయి బలపడడం లేదు. రోజురోజుకూ రూపాయి మరింత బలహీనం అవుతోంది. దీనిని పట్టించుకోక పోవడం వల్ల మాంద్యం దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి. కారణాలను ఎవరో ఒకరిమీద నెట్టి తప్పించుకోవడం కన్నా దూరదృష్టితో సాగివుంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదు. అమెరికా పెడుతున్న ఇబ్బందులు, సుంకాల నేపథ్యంలో డాలర్‌తో మారక విలువను ఆధీనంలోకి తెచ్చుకోక పోతే మరిన్ని కష్టాలు తప్పవు. అలాగే ఎగుమతులకు ప్రాధాన్యం పెరగాలి. అనవసర దిగుమతులకు కళ్లెం వేయాలి. లేకుంటే విదేశీ మారక నిల్వలపై తీవ్రప్రభావం చూపనుంది. దీంతో రూపాయి మరింత బలహీన పడనుంది. ఈ దశలో ఆర్థిక మందగమనానికి చికిత్స వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు చేయాల్సి ఉంది. ఆర్థికవృద్ధికి ఊతమిచ్చేందుకు చర్యలను ప్రకటించి అమలు చేయాలి. కేవలం జిఎస్టీ తగ్గింపులే కాకుండా దేశీయంగా వస్తూత్పత్తి ధరలు దిగివచ్చేలా చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పారిశ్రామిక రంగానికి రుణాలు ఏ మాత్రం అందు బాటులోకి రాకపోవడంతో మార్కెట్‌లో మాంద్యం ఏర్పడిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అది జిడిపి వృద్ధిరేటు దిగజారడానికి దారి తీసిందని విశ్లేషించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకైతే రుణ వితరణలో ప్రతికూల వృద్ధి నమోద యింది. దేశ చరిత్రలో పారిశ్రామిక రంగానికి వాణిజ్య రుణాలు భారీగా తగ్గడం కూడా ఇదే ప్రథమమని భావించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలను గణనీయంగా పెంచడం ద్వారా ఆ లోటును పూడ్చింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగు తుండటం, అమెరికా వాణిజ్య యుద్ధ భయాలు, యుద్దాలు కూడా మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరెన్సీలు దారుణంగా పతనమవడం వంటి అంశాలు మన విదేశీ మారకపు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా లేవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు రూపాయి పతనం పరోక్షంగా దోహదపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి క్షీణతతో దిగుమతులు భారమవుతాయి. చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరిగితే, దేశ వాణిజ్య లోటు అధికమవుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారకపు నిల్వలను అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగు తుంది. విదేశీ ప్రయాణాలు, చదువుల ఖర్చులు భారమవుతాయి. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి సరకులు ప్రియమవుతాయి. అప్పుడు ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో పారిశ్రామిక ప్రగతిపై నీలినీడలు కమ్ముకుంటాయి. పరోక్షంగా ఇది దేశ అభివృద్ధిని అడ్డుకుంటుంది. దీంతోపాటు డాలర్ బలపడుతున్నందున, విదేశీ మదుపర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపసంహరిస్తే, ఈక్విటీ మార్కెట్లు నష్టపోతాయి. ఈ మధ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ హయాంలో వృద్ధిరేటు ఎక్కువ ఉందంటే తమ హయాంలోనే అని వాదులా డుకున్నాయి. కానీ జరుగుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ఫలాల పంపకం ఏ రీతిన ఉన్నదో చూడడం లేదు. అభివృద్ధి అన్నది ఉద్యోగ కల్పనకు గీటురాయిగా ఉండాలి. మొత్తానికి ఇప్పట్లో ఆర్థికరంగం కోలుకునేలా కనిపించడం లేదు.

# దేశ రక్షణ రక్షణరంగ మరింత బలోపేతం

- బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** ఉత్తర్ ప్రదేశ్‌లో భారత రక్షణరంగ ఉత్పత్తుల్ని మరింత బలోపేతం చేస్తూ రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం ఉత్తర్ ప్రదేశ్ లోని నోయిడాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన సందర్భంగా మాట్లాడిన మోదీ.. భారత సైన్యం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్) లక్ష్యంతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. 'మన సైన్యం స్వయం సమృద్ధిని సాధించాలని, విదేశీ మూలాలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ఆశిస్తోంది. ఈ లక్ష్యానికి, భారతదేశంలో బలమైన రక్షణ మౌలిక సదు-పాయాలను అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రతి ఉత్పత్తి 'మేడ్ ఇన్ ఇండియా'గా ఉండాలని నొక్కి చెబుతున్నాం. దీనికి మద్దతుగా, ఉత్తర్ ప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. రష్యా సహాయంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుంది' అని పీఎం మోదీ చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నామని.. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే జరుగుతోందని మోదీ చెప్పారు. ఇందులో భాగంగానే, 'అల్టిమేట్ సోర్సింగ్ బిగిన్స్ హియర్' అనే థీమ్‌తో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఇది ఆవిష్కరణ, సమైక్యత, అంతర్జాతీయీకరణపై దృష్టిపెడుతూ.. విదేశీ కొనుగోలుదారులు, దేశీయ కొనుగోలుదారులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన, ఆధునిక పరిశ్రమలు, కొత్త ఆర్థికవ్యవస్థలను సృష్టించబోతున్నాయని మోదీ అన్నారు. ఈ అభివృద్ధి భారత రక్షణ రంగంలో స్వదేశీ తత్వాన్ని బలపరుస్తూ, ఉత్తర్ ప్రదేశ్‌ను డిఫెన్స్ హబ్‌గా మార్చనుందని ప్రధాని చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ లక్ష్యాలకు ఇది మరో మైలురాయిగా మోదీ అభివర్ణించారు.

# హైడ్రోజనే భవిష్యత్తు ఇంధనం

## కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరీ




**పాట్నా: సెప్టెంబర్25(ఆర్‌ఎన్‌ఎ):** హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనమని కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఇంధనం ప్రాముఖ్యతను మరోసారి నొక్కి చెప్పారు. ఇంధన భద్రత, ఆర్థిక పోటీతత్వం, పర్యావరణ బాధ్యతకు కీలకమైన స్తంభంగా పేర్కొన్నారు. 2030 నాటికి భారత్ ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని కేంద్రమంత్రి చెప్పారు. దీనికి బలమైన పాలసీతో పాటు రూ.19,700 కోట్ల విలువైన ఉత్పత్తి-సంబంధిత ప్రోత్సాహక పథకం మద్దతు ఇస్తుందని తెలిపారు. బయోఫ్యూయల్ బ్లెండింగ్‌ను స్వీకరించడం ద్వారా సాధించిన విసయాలపై ఆయన స్పందించారు. 2020 నాటికి 10శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నామని.. తాము ఐదునెలల ముందుగానే లక్ష్యాన్ని సాధించామన్నారు. అప్పుడు 20శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్‌ని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయన్న ఆయన.. తొలి లక్ష్యాన్ని ఐదునెలల ముందుగానే సాధిస్తే.. రెండో లక్ష్యాన్ని ఆరేళ్ల ముందుగానే సాధించామన్నారు. పానిపట్‌లోని ఇండియన్ ఆయిల్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, విశాఖపట్నంలో టోక్యో ఎనర్జీ బిడ్‌లను ఉటంకిస్తూ.. భారత్‌లో హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చులు ఎలా క్రమంగా తగ్గుతున్నాయో మంత్రి వివరించారు. ఇది పెరుగుతున్న పెట్టుబడిదారుల విశ్వాసమని.. సాంకేతిక పరిపక్వతకు సంకేతంగా పేర్కొన్నారు. ఇండియన్ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్.. గ్రీన్ అమ్మోనియా టెండర్లను సైతం హెలెట్ చేశారు. సహజ వాయువు కంటే లాజిస్టికల్ ప్రయోజనాలను బట్టి గ్రీన్ అమ్మోనియాను ముఖ్యమైన ఎగుమతి అవకాశంగా మంత్రి అభివర్ణించారు. కేంద్ర మంత్రివర్గం జనవరి 4, 2023న రూ.19,744 కోట్ల వ్యయంతో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ఆమోదించింది.

# నిరుద్యోగ యువత ర్యాలీ




**ఖమ్మం,సెప్టెంబర్25 :** జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత కదం తొక్కారు. జాబ్ జ్యాలెండర్ విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్, రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఖమ్మం వీధులు నిరుద్యోగుల నినాదాలతో మార్మోగిపోయాయి. ఖమ్మం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొన్న మానుకోటలో, ఈ రోజు ఖమ్మంలో నిరుద్యోగ యువత రోడ్డెక్కిన తీరు చూస్తుంటే రేవంత్ రెడ్డి ఉద్యోగం త్వరలో ఊడిపోవడం ఖాయమనిపించిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ జరిగిందని దేశమంతా ప్రచారం చేస్తున్నారు. కానీ, అసలైన ఓట్ చోరీ తెలంగాణలో జరిగింది అదే నిరుద్యోగు యువత ఓట్ల చోరీ అని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 ఏళ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ ఎక్కడ అధికారం పోతుందేమో అన్న భయంతో నోటికొచ్చిన హామీ ఇచ్చింది. కానీ, తమకు ఉద్యోగాలు రాగానే నిరుద్యోగులను మరిచిపోయారు. ఎన్నికల్లో ప్రచార సామగ్రిని ఎలా వాడుకొని వదిలేస్తారో అలాగే నిరుద్యోగులను సైతం ప్రచారానికి బస్సు యాత్రలకు వాడుకొని వదిలేశారు. గ్రూప్ -1 ఉద్యోగాల రూపంలో తెలంగాణ ఉద్యోగాల చోరీ కూడా బట్టబయలు అయింది. ఇప్పుడు ఆ ఓట్ల చోరీని కప్పిపుచ్చుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నిరుద్యోగులను ఓడించడానికి లాయర్లకు కోట్లు- ఖర్చు చేస్తుంది అని రాకేశ్ రెడ్డి ఆరోపించారు.

# మాజీ సీఎం కుమారుడి అరెస్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్25:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కొడుకు చైతన్య బఘేల్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో అంటి కరప్షన్ బ్యూరో , ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ సెప్టెంబర్ 24, బుధవారం చైతన్యతో పాటు మరో వ్యక్తి దీపెన్ చావ్డాను కూడా అదుపులోకి తీసుకున్నాయి. ఇద్దరినీ ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కోర్టులో హాజరుపరిచారు, అక్టోబర్ 6 వరకు వారిని ఏసీబీ/ఈఓడబ్ల్యూ కస్టడీకి అప్పగించారు. 2019 నుంచి 2022 వరకు భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ లిక్కర్ స్కామ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్ విలువ దాదాపు 2,500 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకారం, చైతన్య బఘేల్ ఈ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారు. ఈ కుంభకోణంలో సుమారు 1,000 కోట్ల రూపాయల అక్రమ ఆదాయాన్ని చైతన్య నిర్వహించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. అక్రమ నిధులను దాచడానికి, బదిలీ చేయడానికి ఇతర సభ్యులతో కలిసి కుట్ర పన్నినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్‌లో మద్యం అమ్మకాల నుంచి కమీషన్లు, చట్టవిరుద్ధమైన మద్యం అమ్మకాల ఆదాయం, రాష్ట్రంలో లాభదాయకమైన మద్యం వ్యాపారాన్ని నియంత్రించేందుకు డిస్టిలర్లతో కుమ్మక్కై లంచాలు తీసుకోవడం వంటివి ఉన్నాయి. చైతన్య బఘేల్ తరపు న్యాయవాది ఫైసల్ రిజ్వీ ఈ అరెస్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. చైతన్యపై ఎలాంటి ఆధారాలు లేకుండానే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఏసీబీ/ఈఓడబ్ల్యూ దాఖలు చేసిన ప్రధాన చార్జ్‌షీట్ ఆ తర్వాత సమర్పించిన అనుబంధ చార్జ్‌షీట్‌లలో చైతన్య పేరు నిందితుడిగా లేదని ఆయన స్పష్టం చేశారు. 45 మంది నిందితుల్లో 29 మందిని ఎప్పుడూ అరెస్ట్ చేయలేదని, ఎందుకు చైతన్యను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ప్రశ్నించారు. మరో నిందితుడు లక్ష్మీ నారాయణ్ బన్సాల్ ఇచ్చిన వాంగ్మూలంలోనే చైతన్య పేరు వచ్చిందని రిజ్వీ తెలిపారు

# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నాగార్జున




**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** దేశ రాజధాని ఢిల్లీ హైకోర్టును టాలీవుడ్ ప్రముఖ నటుడు, హీరో అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా.. తన ఫోటోతోపాటు తన పేరును వాడుకోకుండ నిషేధం విధించాలంటూ ఢిల్లీ హైకోర్టులో హీరో నాగార్జున పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ తేజస్ కారియా విచారించారు. పర్సనాల్టీ రైట్స్ కోసం గతంలో బాలీవుడ్ హీరోహీరోయిన్లు అమితాబ్ బచ్చన్, ఐశ్వర్య, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్ తదితరులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సినీనటుల అనుమతి లేకుండా వారి పేరును వాడుకోవద్దంటూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హీరో నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

# సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఈడీ విచారణ

## విచారణకు హాజరైన నటుడు జగపతిబాబు


**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరయ్యారు. జగపతి బాబుని నాలుగు గంటలపాటు- ఈడీ అధికారులు విచారించినట్లు- సమాచారం. సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఆయన్ను ఈడీ విచారణకు పిలిచింది. సాహితీ తరఫున పలు ప్రకటనలో నటించిన జగపతిబాబుకు, సాహితీ కంపెనీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల మధ్య ఈడీ విచారించింది. సాహితీ లక్ష్మినారాయణ కంపెనీ అకౌంట్‌లో నుంచి జగపతిబాబుకు నగదు బదిలీ అయినట్లు- గుర్తించినట్లు- అధికారులు తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బులు బదిలీ అయినందున ఆయన్ని పిలిచి విచారించినట్లు- వెల్లడించారు. జగపతిబాబుకు సాహితి నుంచి వచ్చిన డబ్బులకు సంబంధించి సమాచారం తెలుసు కున్నామని అధికారులు స్పష్టం చేశారు. సాహితీ ఇన్ఫ్రా, ప్రీ లాంచింగ్ పేరుతో అపార్ట్‌మెంట్లు-, విల్లాల నిర్మాణం పేరిట కొనుగోలుదారుల నుంచి రూ.248.27కోట్ల మేర వసూలు చేసి, నిర్మాణాలు చేపట్టకుండా మోసానికి పాల్పడిందని ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు సాహితీపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఈడీ దర్యాప్తు చేసింది. సాహితీ నిర్వాహకులు రూ.126కోట్లు- కొనుగోలు దారుల నుంచి వసూలు చేసినట్టు- ఈడీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులతో పలు ఆస్తులను కొనుగోలు చేసినట్లు- చెప్పారు. ఈ మేరకు అధికారులు ఆస్తులను గుర్తించి జప్తు చేశారు. సాహితీ కేసులో మరింత లోతైన విచారణలో భారీఎత్తున స్కామ్ జరిగినట్లు- అధికారులు పేర్కొన్నారు. దీనిలో భాగంగానే సాహితీ ఇన్ఫ్రాక్రు ప్రకటనలు చేసిన నటినటు-లను ఈడీ విచారిస్తోంది.

26-09-25 Samayam_Layout 1 9/26/2025 9:45 AM Page 5



# తప్పులు చేసేవారిని వదలను

అమరావతి : శాసనసభలో శాంతి భద్రతల అంశంపై స్వల్ప కాలిక చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. శాంతిభద్రతలు- సామాజిక మాధ్యమాల అంశంపై సీఎం ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం గురించి పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారని తెలిపారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడుపైనా అత్యాచారయత్నం కేసులు పెట్టారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి, స్పీకర్, డిప్యూటీ- స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన అక్రమకేసుల బాధితులే అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. తనపై 17 కేసులు పెట్టి వేధించారు.. ఇది అరాచకానికి పరాకాష్ట అంటూ మండిపడ్డారు. యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేష్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారని.. 'అంగళ్లులో గత పాలకులు నాపై దాడి చేసి తిరిగి నాపైనే కేసులు పెట్టారని గుర్తుచేశారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు తొలగించి వేధించారని మండిపడ్డారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జేసీ ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బీటెక్ రవి, కూన రవి ఇలా నేతలందరిపై కేసులు పెట్టారని తెలిపారు . గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే అని అన్నారు. రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసినప్పుడు తమకు నిద్ర లేకుండా పోయిందని అప్పటి దారుణాలను సీఎం వివరించారు. అమరావతి రైతులు రాజధాని కోసం పోరాడుతుంటే.. స్నానాలు చేసే బాత్ రూమ్‌లపై డ్రోన్లు ఎగరేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పాదయాత్రలోనూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారన్నారు. వీళ్ల అరాచకాలు భరించలేక పారిశ్రామిక వేత్తలు కూడా రాష్ట్రం నుంచి పారిపోయారని తెలిపారు. అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయారని.. రాజకీయాల నుంచి కూడా తప్పుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సింగపూర్ ప్రభుత్వం ప్రపంచంలోనే అత్యంత గౌరవప్రదమైనదన్నారు. చివరకు ట్రంప్, కిమ్‌కు చర్చలు సింగపూర్‌లో పెట్టారని తెలిపారు. సింగపూర్‌లో నైట్ క్లీనింగ్ చూసి హైదరాబాద్‌లో ప్రవేశపెట్టినట్లు- గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో రాజధానిని కడతామని చెప్పామని.. సింగపూర్‌కు సమానంగా కడతామని తెలిపారు. అక్కడి ప్రభుత్వం మాస్టర్ ఎ÷-లాన్‌ను ఫ్రీగా చేసి ఇచ్చిందని.. అలాంటి వాళ్లను వీళ్లు భయపెట్టా



రంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత పాలకుల హయాంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని..కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నామన్నారు. నేరస్థులకు అండగా ఉండే రాజకీయ నేతలను తాను ఇంతవరకూ చూడలేదని.. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలని... వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారని తెలిపారు. వాహనాలకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగానే ఉంటామని తేల్చిచెప్పారు. ప్రస్తుతం టెక్నాలజీ ఫ్రాడ్స్, సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని.. నిద్ర లేచినప్పటి నుంచి నిద్ర పోయే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పేటియం బ్యాచ్‌లు పెద్ద ఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని... అది ఫేక్ అని మనమే చెప్పుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఇప్పుడు మరోలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. వివేకా హత్య కేసు ఘటన జరిగినప్పుడు క్రైమ్ సీన్‌లో శంకరయ్య ఉన్నారని.. వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రిగా తననూ ఏమార్చారన్నారు. గుండెపోటు కాదు గొడ్డలి పోటు అని తేలిందని... అక్కడున్న రక్తాన్ని శుభ్రం చేశారని తెలిపారు. ఏమీ తెలియని వారిలా అమాయకంగా వచ్చి స్టేట్ మెంట్ ఇచ్చారని.. ఫేక్ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని సీఎం చెప్పుకొచ్చారు. రాజకీయ పరంగా చాలా మందిని ఎదుర్కొన్న తాను ఇప్పుడు నేరస్తుల్ని ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. శంకరయ్య ఒక సీఎంకు నోటీసులు పంపించటం అంటే ఎంత ధైర్యం చేసి ఉండాలి. నేరం జరిగినప్పుడు సీన్ ఆఫ్ అఫెన్సులో సీఐగా విధులు నిర్వహించి నేరం జరిగిన ప్రాంతాన్ని రక్షించాలి. క్రిమినల్స్‌తో కలిసి పోయి ముఖ్యమంత్రికే నోటీసు పంపించే స్థాయికి శంకరయ్య చేరుకున్నారు. పొగాకు రైతుల్ని పరామర్శించడానికి వెళ్లి సినిమా డైలాగులు చెప్తారా?' అంటూ ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇకపోతే మహిళలపై రాష్ట్రంలో నేరాలు తగ్గాయి. గతంతో పోల్చుకుంటే 4.84 శాతం మేర మహిళలపై నేరాలు తగ్గాయి. వరకట్న మరణాలు 43 శాతం తగ్గాయి. మహిళా హత్యలు 15 తగ్గాయి. మహిళా ఆత్మహత్యలు 59 శాతం తగ్గాయి. మహిళలపై సైబర్ వేధింపులు 17 శాతం తగ్గాయి. వరకట్న వేధింపులు 25 శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారిలో 343 మందికి శిక్షలు పడ్డాయి. మహిళలను కించపరిచేలా పోస్టింగ్‌లు పెట్టి అవమానిస్తారా? ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. మహిళలపై నేరం జరిగితే కేవలం 8-10 నిముషాల్లోపే ఘటనా స్థలికి చేరుకునేలా చర్యలు చేపట్టాం. శక్తి టీమ్‌లను ఏర్పాటు- చేసి మహిళల రక్షణ పట్ల చర్యలు చేపడుతున్నాం. సెక్సువల్ అఫెండర్లపైనా రౌడీషీట్లను ఓపెన్ చేస్తాం, ఆన్ లైన్‌లోనూ ఫోటోలు పెట్టి ఎక్స్ పోజ్ చేస్తాం' అని వార్నింగ్ ఇచ్చారు.సింగయ్యను కారు కింద తొక్కించేసి తిరిగి బురదజల్లే ప్రయత్నం చేశారని ఫైర్ అయ్యారు సీఎం. కనీసం మానవత్వం లేకుండా పొదల్లోకి విసిరేసి వెళ్లిపోయారన్నారు. తిరిగి మృతుడి భార్యతో అసత్యాలు చెప్పించారని.. తన భర్త జగన్ కారు కింద చనిపోలేదని, పోలీసులు అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని చెప్పించారన్నారు. మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్లి రోడ్డుపై మామిడికాయలు ట్రాక్టర్లతో తొక్కించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టంగా చెబుతున్నామన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు అనుగుణంగా ఏపీ ముందుకు వెళ్లాలని.. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలని ఆకాంక్షించారు. గత పాలకులు టీడీపీ కార్యాలయంపై కూడా దాడి చేశారని.. దీనిపై అప్పటి గవర్నర్‌కు, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## గత వైకాపా పాలనలో అరాచకం

అమరావతి : గత ప్రభుత్వ హయాంలో అందరూ బాధితులేనని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో తనపై ఎప్పుడూ ఎవరూ కేసులు పెట్టలేదని, ఏ తప్పూ చేయను కాబట్టే కేసులు పెట్టేందుకు భయపడతారని తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ తప్పు చేయనని, న్యాయబద్ధంగా సరిగ్గా ఉంటానని చెప్పారు. ఎవరైనా తప్పులు చేస్తే మాత్రం వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తామన్నారు. నావి కక్ష రాజకీయాలు కావని గుర్తుపెట్టుకోవాలి. అలిపిరి వద్ద నా కారును మావోయిస్టులు పేల్చారు. నాతోపాటు- కారులో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. 23 క్లెమోర్ మైన్స్ పేల్చినా కూడా నేను బయటపడ్డాను. తుపాకీతో సమస్యలు పరిష్కరిస్తామనడం సరికాదని పోరాడాను. తాను బతకడం శ్రీవారి అనుగ్రహమని అన్నారు. పేలుడు తరవాత స్ట్రెచర్‌పై ఉన్న తాను ఏంజరిగిందంటే నక్సల్స్ దాడి అని చెప్పారు. అందుకే వారు జనజీవన స్రవంతిలోకి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చాను. పోరాడితే నాపై దాడి చేసే పరిస్థితి. కానీ, నేను భయపడలేదు. రాష్ట్ర భవిష్యత్ కోసం నా ప్రాణాలు పోయినా ఫర్వాలేదని కష్టపడ్డాను. రాయలసీమ రత్నాల సీమగా మారుతోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే పార్టీలు ఉండాలి. కూటమి ప్రభుత్వం పద్ధతి ప్రకారం పని చేస్తోంది. అవసరమైతే చట్టాలకు మరింత పదును పెడతాం. నేర ప్రవృత్తి ఉండే వ్యక్తులను కట్టడి చేసే బాధ్యత తీసుకుందాం. 2027 నాటికి ప్రపంచంలో భారత్ నెంబర్ వన్‌గా ఉంటుంది. భారత్‌లో నంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ ఉండాలన్నదే తన లక్ష్యం అన్నారు. ప్రపంచంలో తెలుగు జాతి నంబర్ వన్‌గా ఉండాలనేది ప్రభుత్వ సంకల్పం. రాయలసీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేయడం తెదేపా విధానం. నేర ప్రవృత్తి ఉండే వ్యక్తులను కట్టడి చేసే బాధ్యత తీసుకుందామని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై 17 కేసులు పెట్టారు. నాపై ఎందుకు కేసులు పెట్టారని అడిగితే సమాధానం ఉండదు. కేసు వివరాలు వాట్సప్‌లో పంపిస్తామనడం అరాచకాలకు పరాకాష్ట. లోకేశ్, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డి, ధూళిపాళ్లపై కేసులు పెట్టారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 66 కేసులు పెట్టారు. తెదేపా కార్యకర్తలపై 2500కుపైగా కేసులు పెట్టారు. పులివర్తి నానిపై 31, చింతమనేని ప్రభాకర్‌పై 40కి పైగా కేసులు పెట్టారు. ఎవరితోనూ పరుషంగా మాట్లాడని నిమ్మల రామానాయుడుపై 20 కేసులు, దేవినేని ఉమపై 27, ఆంజనేయులుపై 16, అయ్యన్నపై 14, బీటెక్ రవిపై 14, కూన రవికుమార్‌పై 15, కాల్వ శ్రీనివాసులపై 14 కేసులు పెట్టారు. రఘురామ కృష్ణరాజును జైలులో చిత్రహింసలకు గురి చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిని 45 సార్లు అరెస్టు చేశారు. రాజధాని మహిళా రైతుల ఇళ్ల బాత్రూమ్‌లపై డ్రోన్‌లు ఎగురవేశారు. న్యాయస్థానం-దేవస్థానం కార్యక్రమం చేపడితే ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. రాష్ట్రం నుంచి అనేకమంది పారిశ్రామికవేత్తలు పారిపోయారు. సింగపూర్ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేశారు. భయపెట్టారు. అయినప్పటికీ.. రాజధాని మాస్టర్‌ప్లాన్ ఉచితంగా ఇవ్వడానికి సింగపూర్ ప్రతినిధులు అంగీకరించారు.

## మెగా డీఎస్సీని సాధించి చూపాం



**అమరావతి :** మెగా డీఎస్సీ సాధ్యమా అన్నారు.. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేసి చూపించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు- చేసిన వేదికపై 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 150 రోజుల్లోనే డీఎస్సీ పూర్తి చేసిన.. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను అభినందించారు. ఈ రాష్ట్రంలో పేదరికంలేని సమాజం రావాలి.. అది విద్య ద్వారానే సాధ్యమవుతుంది. అందులో టీచర్లదే కీలక పాత్ర. పిల్లల భవిష్యత్తు మారుస్తారనే టీచర్లను ఎక్కువగా గౌరవిస్తాను. నేను రాజకీయాల్లోకి రావడానికి ఎకనమిక్స్ ప్రొఫెసర్ డీఎల్ నారాయణ ప్రోత్సహించారు. యూనివర్సిటీ క్యాంపస్ నుంచే ఎమ్మెల్యేగా పోటీ- చేశా. ఎమ్మెల్యేగా ఎన్నికైనరెండేళ్లకే మంత్రి అయ్యాను. మనల్ని ప్రోత్సహించే వారుంటే ఆకాశమే హద్దుగా ఉంటుంది. పిల్లల్లో నైపుణ్యాలను ఉపాధ్యాయులే గుర్తించాలి. ప్రపంచ మార్పుల మేరకు ఏపీ యువత విద్య అభ్యసించాలి. పిల్లల మనోభావాల మేరకు చెబితే మంచి ఫలితాలు వస్తాయని చంద్రబాబు అన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు డీఎస్సీలో టీ-చర్లుగా ఎంపి-కై-న 15,941 అభ్యర్థులకు నియమాక పత్రాలను అందజేశారు. కొద్దిసేపు టిచర్లతో ముచ్చటించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం సభను ఉద్దేశించి చంద్రబాబు ప్రసగించారు. ఇకపై ప్రతిఏటా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని నిరుద్యోగులకు శభవార్త చెప్పారు. ఏపీలో చేతకాని పక్షం ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. మంచి చేయదు.. మంచి జరుగుతుంటే ఓర్వలేదని ఆరోపించారు. గతంలో పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితిని గుర్తు చేశారు. కానీ టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు వచ్చాయని చెప్పారు. వైసీపీ హయాంలో ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యావ్యవస్థ నాశనం అయ్యిందని చంద్రబాబు మండిపడ్డారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టానని చంద్రబాబు తెలిపారు. టీ-చర్లుగా నియామక పత్రాలు తీసుకున్న వారిని అభినందించారు. అవినీతి లేకుండా.. పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టి.. టీ-చర్ల పోస్టింగ్ ఇచ్చామన్నారు. బాబు షూరిటీ-.. జాబ్ గ్యారెంటీ- అని చెప్పాను.. దాన్ని నిజం చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. రూ. 10 లక్షల కోట్లు- పెట్టు-బడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. వాటి ద్వారా నిరుద్యోగులకు 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీని పెట్టి, 1,96,619 ఉద్యోగాలిచ్చామన్నారు. ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుంది.. నిరుద్యోగులు ప్రిపేర్ అవుతూ ఉండాలని ఆయన సూచించారు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారని మండిపడ్డారు. అన్ని ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ నిర్వహించిన లోకేష్ టీ-ంను చంద్రబాబు అభినందించారు. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం.. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చారు.. ధరలు తగ్గించారని పేర్కొన్నారు. విద్యా రంగంలో సంస్కరణలు తెస్తున్నాం.. సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వివరించారు. పేరెంట్ టీ-చర్ల మీటింగులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మన బడి- మన భవిష్యత్ పేరుతో మౌళిక సదుపాయాల కల్పన చేపడుతున్నట్లు- చెప్పుకొచ్చారు. టీ-చర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా ఒక్క ఫిర్యాదు కూడా లేకుండా బదిలీలు పూర్తి చేశామని ధీమా వ్యక్తం చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా.. ప్రతి ఒక్కరికి రూ.15 వేలు చొప్పున ఇచ్చామన్నారు.నారా లోకేష్ నో బ్యాగ్ డే విధానం తెచ్చారు.. ఇది వినూత్నంగా ఉందని చంద్రబాబు తెలిపారు. ఈసారి స్కూళ్లు తెరిచేలోగానే స్కూల్ కిట్లు-, పుస్తకాలు ఇచ్చామని పేర్కొన్నారు. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి.. ఆదాయం పెరుగుతుందన్నారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయని అన్నారు. నో అడ్మిషన్ల బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చామని ధీమా వ్యక్తం చేశారు. ఇది మరింతగా పెరగాలని కోరుకుంటున్నట్లు- చెప్పారు. విద్యాశాఖ కఠినంగా ఉంటు-ందని చెప్పాను.. అయినా లోకేష్ ఛాలెంజిగ్గా తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రాథమిక విద్య బాగుంటే ఉన్నత చదువులు అద్భుతంగా ఉంటాయని, దీంతో అభివృద్ధిలో రాష్ట్రం దూసుకెళ్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మెగా డీఎస్సీ విజేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అత్యాధునిక వసతి సముదాయం

మొదటి పేజీ తరువాయి



నూతన కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఇందులో ఒకేసారి 4 వేల మందికి ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నారు. 16 డార్మిటరీలు, 2,400 లాకర్లు, 24 గంటలూ వేడి నీటి సదుపాయం ఇందులో ఉన్నాయి. పీఏసీ-5 ప్రాంగణంలో ఒకేసారి 80 మంది తలనీలాల సమర్పణకు వీలుగా కల్యాణకట్ట ఏర్పాటు- చేశారు. ఒకేసారి 1400 మంది భోజనానికి వీలుగా రెండు డైనింగ్ హాళ్లు ఉన్నాయి. వసతి గృహం బుకింగ్ కౌంటర్‌ను ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి సీఎం పరిశీలించారు. నూతన వసతిగృహంలో తొలి బుకింగ్ టోకెన్‌ను భక్తులకు అందించారు. కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. ఒకేసారి 1400 మంది భక్తులు భోజనం చేసేందుకు వీలుగా ఈ కాంప్లెక్సులో రెండు భారీ డైనింగ్ హాళ్లను కూడా అందుబాటు-లో ఉంచారు. ఈ సందర్భంగా వసతి గృహం బుకింగ్ కౌంటర్ లో బుకింగ్ జరుగుతున్న విధానాన్ని అధికారులు వివరించారు. తొలి వసతి బుకింగ్ టోకెన్ ఓ భక్తురాలికి సీఎం చంద్రబాబు అందించారు. తిరుమల పోటులో కొత్తగా తీసుకువచ్చిన ప్రసాదం తయారీ కోసం వినియోగించే సార్టింగ్ యంత్రాలను ప్రారంభించారు. అనంతరం ఈ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన వ్యర్థాల సేకరణ యంత్రాన్ని ఇరువురు నేతలు ఆసక్తిగా పరిశీలించారు.

**పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి**

ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ గురువారం మధ్యాహ్నం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయం వద్దకు చేరుకున్న ఉపరాష్ట్రపతికి అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన ఆలయంలోని ధ్వజస్తంభానికి మొక్కుకుని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, జేఈవో వీరబ్రహ్మం అమ్మవారి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయ-ణరెడ్డి, అనగాని సత్య ప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు దివాకర్ రెడ్డి, రామ్మూర్తి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుచానూరు ఆలయ డిప్యూటీ- ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాధ్యతారహితంగా జగన్ వ్యవహారం

**అమరావతి :** వైకాపా నేత జగన్.. ప్రజల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. వైకాపా నేతలు ఇటీవల చేస్తున్న 'రప్పా రప్పా' డైలాగులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్టీఆర్ హయాం నుంచి తాము రాజకీయాల్లో ఉన్నామని.. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని స్పీకర్ అన్నారు. వైకాపా సభ్యులు సభకు రాకుండానే ప్రశ్నలు పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో గౌతు లచ్చన్న పార్టీ తరఫున 64 మంది ఎన్నికైతే ప్రతిపక్ష హోదా ఇచ్చారని.. అయితే సభ్యులు కొందరు పార్టీ మారిన నేపథ్యంలో ఆయన ప్రతిపక్ష హోదాను స్వయంగా వదులుకున్నారని గుర్తు చేశారు. జగన్ మాత్రం సంఖ్యాబలం లేకున్నా ప్రతిపక్ష హోదా అడగటమేంటని ప్రశ్నించారు. 'సభాపతిగా నేను ఈ కుర్చీలో కుర్చున్నా నాకు కూడా కొంత ఆవేదన కలుగుతోంది. ప్రెస్ మీట్, సోషల్ మీడియాలో రోజు చూస్తున్నాం వారు మాట్లాడే తీరు. మళ్లీ మేమే వస్తాం మీ అంతుచూస్తాం, పీకలు కోస్తాం... రప్పా రప్పా అంటూ సినిమా డైలాగులు. ఎన్టీఆర్ పార్టీలోనే మేము కూడా ఓడిపోలేదా.... ఓడిపోతే రప్పా రప్పా నా.... ఇందిరాగాంధీ వంటి మహనాయకురాలు ఓడిపోలేదా. మీలా మాట్లాడలేను ఆవేశం వస్తుంది.. అయితే కంట్రోల్ చేసుకోవాల్సి వస్తుంది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు వస్తాయని.. అయితే ప్రతిపక్షంగా ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడంలో లోటుపాట్లు- ఉంటే అసెంబ్లీకి వచ్చి చెప్పాలని సూచించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని... ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇక్కడ ఉంటారని తెలిపారు. సభకు రారు, ఎమ్మెల్యేలను రానివ్వరు... క్వశ్చన్‌లు మాత్రం పంపుతున్నారని.. ప్రజలు దీన్ని ఖండిచాల్సిన అవసరం ఉందన్నారు. 'రాజకీయ కారణాలతో కొంతమంది సభ్యులు వెళ్లిపోతే.. ఆయన తనకు నెంబర్ లేదని సభకు వచ్చి ప్రతిపక్షనేతగా రాజీనామా ఇచ్చేశారు. ఇప్పుడు నెంబర్ లేకుండా నాకెందుకు ఇవ్వరు అంటున్నారు. చివరకు నాపై హైకోర్టుకు వెళ్లారు.... ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్లారు. నేను ఎక్కువ మాట్లాడలేను.. అయినా మాట్లాడాలని అనిపించింది. పిల్లల భవిష్యత్తు.. రాష్ట్ర భవిష్యత్త కోసం అందరూ పనిచేయాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శాసనసభలో రాష్ట్రంలో శాంతి భద్రతలు అంశంపై చర్చను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ రావు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని విమర్శించారు. సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులను హరించారని మండిపడ్డారు. పల్నాడులో రాజకీయ కక్షతో హత్యలు చేశారని గుర్తుచేశారు. చంద్రయ్యను పట్టపగలు నడి రోడ్డుపై హత మార్చారని తెలిపారు. అందుకనే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మట్టి కరిపించారంటూ యరపతినేని వ్యాఖ్యలు చేశారు.

## ఉద్యోగుల సమస్యలపై మండలిలో వాడీవేడీ చర్చ

**అమరావతి :** పీఆర్సీ పునర్నిర్మాణం, బకాయిల చెల్లింపు అంశాలపై ఏపీ శాసనమండలిలో వాడీవేడిగా చర్చ సాగింది. వైకాపా ఎమ్మెల్సీల ప్రశ్నలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానమిచ్చారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మునూ వైకాపా ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నట్లు- తెలిపారు. ఈ క్రమంలో ఉద్యోగుల సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ ఇచ్చిన సమాధానంపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి మోసపూరితమైన మాటలు నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను , ప్రజలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగుల ఆవేదనకు మద్దతు తెలుపుతూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నామంటూ బొత్స సత్యనారాయణ సభ నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు మంత్రి పయ్యావుల ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతూ గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత సర్కార్ దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. ఉద్యోగుల జీపీఎఫ్‌ను వివిధ అవసరాలకు వాడుకుని... ఇప్పుడు ఉద్యోగుల విషయంలో మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు- ఉందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చిందన్నారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటు-న్నామ న్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల వేతనాల పెంపు కోసం పీఆర్సీ కమిషన్ నియామకంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. సరైన సమయంలో సీఎం చంద్రబాబు పీఆర్సీ నియామకంపై చర్యలు తీసుకుంటారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

26-09-25 Samayam_Layout 1 9/26/2025 9:45 AM Page 6



# పత్తి రైతులకు సేంద్రియ పద్ధతులపై అవగాహన.



**రాయపోల్,సెప్టెంబర్25:** మండలంలోని ముంగిసపల్లి, పెద్ద ఆరేపల్లి గ్రామాల్లో భారత నవ నిర్మాణ సంస్థ (Better Cotton Project) ఆధ్వర్యంలో గురువారం పత్తి రైతులతో అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రైతులకు రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసరించాలని సూచించారు. వావిలకు కషాయం పిచికారీ చేయడం వలన పచ్చదోమ, పెనుబంక, తెల్లదోమ వంటి రసపీల్చే పురుగులు నశిస్తాయని తెలిపారు. అదేవిధంగా అగ్నియస్త్రం వాడకంపై వివరించి, వావిలకు తయారీ విధానం చూపించారు. పత్తిలో వచ్చే గులాబీ పురుగును నివారించడానికి లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, అంతర పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. ఎర పంటలుగా బంతి, ఆముదం వేసుకోవడం ద్వారా పంట దిగుబడిని పెంచుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా మహిళలు వ్యవసాయంతో పాటు అన్ని రంగాలలో ముందుకు రావాలని మారి సంస్థ ప్రతినిధులు సూచించారు. పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ విధానాలను పాటించడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. భాస్కర్ తో పాటు ఫీల్డ్ ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు.

# ఈరోజు ఖిలా వరంగల్ లో స్వచ్ఛ ఉత్సవ్



**వరంగల్ సెప్టెంబర్ 25. (సమయం న్యూస్) :** కేంద్రపురావస్తు శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ మండల్ సూపరిండెంట్ నీహాల్దాస్ ఆదేశాల అనుసారంలో ఈరోజు కిలా వరంగల్ లో "స్వచ్ఛుత్సవ్" "స్వచ్ఛత హై సేవకు" ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత "గడ్డం సమ్మయ్య", అసిస్టెంట్ సూపరిండెంట్ దేశాయ్, కృష్ణ చైతన్య, అసిస్టెంట్ ఆర్కాలజిస్ట్ . సాయికృష్ణ, గోల్కొండ కన్జర్వేషన్ అసిస్టెంట్ మల్లేశం, తేజ, గైడ్ రవి యాదవ్, జూనియర్ కాలేజ్ శ్రీనివాస్ రావు మరియు విద్యార్థిని విద్యార్థులు, యూనివర్సిటీ కోఆర్డినేటర్ మరియు విద్యార్థిని విద్యార్థులు, మరియు "పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సన్మానించడం జరిగింది" కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొనడం జరిగింది

# క్రీడా ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించండి.



**మహబూబ్ నగర్ సెప్టెంబర్25( సమయం న్యూస్). :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం ను గురువారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం,వాలీ బాల్ అకాడమీ,స్విమ్మింగ్ పూల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించి స్టేడియం లో నిర్వహించే క్రీడంశాలను గురించి తెలుసు కొన్నారు. స్విమ్మింగ్ పూల్ చుట్టూ పరిశుభ్రం గా ఉంచాలని సూచించారు. వాలీ బాల్ అకాడమీ విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, ఉన్నారు

# పాఠశాలలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి



**కొడంగల్,మున్సిపాలిటీ (మం)సెప్టెంబర్,25-09(సమయం న్యూస్) :** గురువారం అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి వికారాబాద్ జిల్లా కోడంగల్ మండలంలోని చిన్ననందిగామ, ఇనోనపల్లి, బుల్కాపూర్, చిట్లపల్లి తండా హుస్సేన్‌పూర్ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామ్ రెడ్డి, ఏఎంఓ రాం మస్తా పాల్గొన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న కంప్యూటర్ ఆధారిత కృత్రిమ మేధ విద్య పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత విద్యార్థులతో మాట్లాడి వారికి చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్శనలో హెచ్ఎంలు భారతి, మౌనిక, జయభారతి, సాయికిరణ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# అధిక వర్షాలు యూరియా కొరతతో పంటలు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో రైతాంగం



**వరంగల్ సెప్టెంబర్ 25. (సమయం న్యూస్) :** యాసంగి వరి బోనస్ డబ్బులను జమ చేయకపోవడం అన్యాయంఅధిక వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలు ఇవ్వాలిసబ్సిడీ ఎత్తివేయడానికే యూరియా కొరతను సృష్టించిన కేంద్రంమద్దతు ధర తగ్గకుండా రైతుల పత్తిని కొనాలిఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో రైతాంగం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేయబడుతున్నారని తక్షణమే రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈరోజు అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ కలెక్టరేట్ వద్ద వర్షంలో తడుస్తూ ప్లే కార్డ్స్, బ్యానర్లు చేతబూని నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి 40 లక్షల ఎకరాలు సాగు అవుతుందని అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఎరువులు రుణాలు విత్తనాలు సమకూర్చడంలో విఫలం చెందిందన్నారు. ఈ క్రమంలో యూరియా కొరత అధిక వర్షాలతో రైతుల పంటలు తీవ్రంగా దెబ్బతిని దిగుబడి రాని పరిస్థితి నెలకొన్నదని దాంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కావాల్సినంత యూరియా అందించకుండా ఎరువులపై ఉన్న సబ్సిడీని ఎత్తివేసేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. జిల్లాలో లక్ష 14 వేల ఎకరాలలో పత్తి పంటను వేశారని అందులో ఎకరాకు రెండు మూడు క్వింటాల్ సైతం దిగుబడి వచ్చే పరిస్థితి లేదని అట్టిపత్తిని సైతం మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన సిసిఐ రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఫ్లాట్ బుకింగ్ అంటూ అనేక ఆంక్షలు విధించి ప్రైవేట్ వ్యాపారులకు వత్తాసు పలుకుతున్నారని ఇది సరైనది కాదని రైతులు తీసుకువచ్చే పత్తిని దేశరత్తుగా మద్దతు ధర తగ్గకుండా మార్కెట్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశీయ పత్తి రైతులకు హాని కలిగించే విదేశీ పత్తి దిగుమతులపై ఎత్తివేసిన 11 దిగుమతి సుంకాలను తక్షణమే పునరుద్ధరించి పత్తి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. గత యాసగిలో రైతులు ఆరుగాలంకష్టించి అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి సన్న రకం వరి ధాన్యాన్ని పండిస్తే ప్రభుత్వం క్వింటాకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రచార ఆర్భాటం చేసి నేటికీ రైతుల ఖాతాలో జమ చేయకపోవడం




దారుణం అన్నారు. ఇప్పటికైన తక్షణమే రైతులకు రావలసిన బోనస్ డబ్బులను చెల్లించాలని కోరారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఇలాంటి పరిస్థితులలో సాగు దారులను ఆదుకునేందుకు పంటలు కోల్పోయిన రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి ఎకరాకు 25వేల రూపాయల పరిహారాన్ని ఇవ్వాలని లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి సంధ్యారాణి గారికి సమస్యలతో కూడిన మెమోరాండాన్ని అందించారు. ఈ ఆందోళనలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ ఇస్మాయిల్ కుసుంబా బాబురావు సీనియర్ నాయకులు నాగెల్లి కొమురయ్య సహాయ కార్యదర్శి గోనే రామచందర్ జిల్లా నాయకులు మహమ్మద్ రాజా సాహెబ్ చెవ్వ కుమారస్వామి గటికే మొగిలి సోమిడి రవి దేవర రాజు రాజమల్లు వెంకటస్వామి రాజేందర్ వీరన్న తదితరులతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

**• జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25 : ( సమయం న్యూస్ )**

స్వచ్ఛత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడు నిరంతరం ఆచరించాల్సిన బాధ్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పరిశుభ్రతా కార్యక్రమాలు సమాజంలో నిత్యకృత్యంగా కొనసాగితేనే ఆరోగ్యవంతమైన, శుభ్రమైన, పచ్చదనంతో కూడిన వాతావరణం ఏర్పడుతుందని ఆయన పౌరులకు పిలుపునిచ్చారు. భారత ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్రత్యేక శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఆవరణలో గడ్డిని, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రతను కాపాడే దిశగా అందరూ కలసికట్టుగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతేనని, సమాజం పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణంలోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులతో



పాటు విద్యార్థులు, యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటే భవిష్యత్ తరాలకు పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన సమాజాన్ని అందించగలమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఏడి మైన్స్ దినేష్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ ఏడి రమేష్, మెప్మా పీడీ రాజేష్ మరియు జిల్లా ఉద్యోగులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ పేరుతో.. పేద ప్రజలను దోచుకున్న కేంద్ర సర్కార్

**• ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 25 :** జీఎస్టీ పేరుతో ప్రజలను దోచుకున్న కేంద్రంలోని బిజెపి సర్కార్, ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే 28 శాతం జీఎస్టీ భారాన్ని ప్రజలపై మోపి దానిని ప్రస్తుతం18 శాతానికి తగ్గించి చంకలు గుద్దుకోవడం సిగ్గుచేటని నిలదీశారు. ముఖ్యంగా దేశంలో రోజురోజుకు బిజెపి బలహీన పడుతుండగా, భయంతోనే జీఎస్టీ తగ్గించి కాళ్లభేరానికి వచ్చినట్లు ఎద్దేవా చేశారు. అయితే మేకిన్ ఇండియా పేరుతో ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుండగా, యూరియాను చైనా నుండి, పెట్రోల్ ఉత్పత్తులను రష్యా నుండి, ఆయిల్ ముడి సరుకులను మలేషియా నుండి దిగుమతి చేసుకోవడంలో అంతర్యమేమిటని నిలదీశారు. అయితే జిఎస్టి పేరుతో రూ లక్షల కోట్ల నిధులను ముక్కు పిండి వసూలు చేయగా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాలేశ్వరం ప్రాజెక్టు, జాతీయ రహదారుల అభివృద్ధికి నయా పైసా విదిల్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన పేరిట కేంద్రం చేపడుతున్న పథకాలు పక్కదారి పడుతుండగా, రోజురోజుకు రూపాయి విలువ క్షీణించిపోతున్నట్లు



విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్న%శీ% కాగా, బంగారం ధర రూ లక్ష 20 వేలకు చేరుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పేదలు చీకట్లో మగ్గుతుండగా, బిజెపి నేతలు దండుకుంటూ వెలిగిపోతున్నట్లు ఆరోపించారు. ఉద్యోగ కల్పనకు హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఆయన అనాలోచిత విధానాలతో పక్కనే ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, చైనా, శ్రీలంక దేశాలతో శత్రుత్వం పెరిగిపోయినట్లు చెప్పారు. చైనా, జపాన్ తో పోటీ పడాల్సిన భారత్ లో మతం పేరిట రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నట్లు విమర్శించారు. చివరకు అమెరికాతో శత్రుత్వం వలన ఇక్కడి యువత దేశానికి తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొనగా, రోడ్డున పడబోతున్న ఆ కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎంసీ రాజమౌళి బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా కౌన్సిలర్లు మెట్టయ్య దుర్గ ప్రసాద్ బబ్బూరి రజిత గుంటుకు రాజు గంగిశెట్టి రవీందర్ బిఆర్ఎస్ నాయకులు హైదర్ పటేల్ పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కల్లూరు జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు

● మంత్రి పొంగులేటి





**ఖమ్మం,సెప్టెంబర్ : 25 ( సమయం న్యూస్ )** కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసారు. కల్లూరు మున్సిపాలిటీ ప్రాంతంలో మైనారిటీ సంక్షేమ శాఖచే 75 లక్షలతో నిర్మించిన షాదీఖాన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని, విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కల్లూరు జూనియర్ కళాశాలకు 3.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం అనే కుగ్రామంలో పుట్టిన తాను, ఇదే కళాశాలలో విద్యార్థిగా చదువుకున్నానని తన జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. 10వ తరగతి తర్వాత ఇంటర్ లో చదివేందుకు సైకిల్ మీద కళాశాలకు వస్తూ ఇంటర్ పూర్తి చేయడం జరిగిందని అన్నారు. గతంతో పోలిస్తే నేడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాలలో ఉన్న కుటుంబాలలో 90 శాతం వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారై ఉంటారని అన్నారు. తల్లిదండ్రుల తాపత్రయం, కష్టం పిల్లలు అర్థం చేసుకుంటే జీవితంలో రాణించే ఆస్కారం ఉంటుందని అన్నారు. జీవితంలో మనం తల్లిదండ్రులు, టీచర్స్, ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావడమే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థ సహకరించక పోయినా గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జీలు 200 శాతం పెంచడం జరిగిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 కోట్లతో యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, 75 నుంచి 80 కోట్లతో ఏ.టి.సి. సెంటర్ల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలను విద్యాశాఖ క్రింద చేపట్టామని అన్నారు. కల్లూరు జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేస్తామని, డిజిటల్ తరగతులకు మెటీరియల్ మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. రాబోయే కొద్ది రోజులలో శాశ్వత హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జూనియర్ కళాశాల విద్యార్థి జీవితంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఇంటర్ లో బాగా చదివితే మంచి ఇంజనీరింగ్, మెడికల్, ఇతర వృత్తి నైపుణ్య కళాశాలలో సీటు లభిస్తుందని , దీని వల్ల విద్యార్థికి మంచి కెరియర్, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూలి అన్న అంటే నేను ఉన్నా అంటూ అనునిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి మంత్రివర్యులు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. కల్లూరు జూనియర్ కళాశాలకు హాస్టల్ భవనం, ఫర్నిచర్ మంజూరు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం ప్రజలను చూసి కష్టపడితే బాగుపడతామని ఆలోచన ప్రతి ఒక్కరు తెలుసు కోవాలని అన్నారు. ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని, కష్టపడి సాధన దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం కల్లూరు లో 75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంబేద్కర్ లైబ్రరీ భవనం, రీడింగ్ రూం నిర్మాణ పనులకు మంత్రివర్యులు శంకుస్థాపన చేశారు. కల్లూరు మార్కెట్ యార్డ్ లో బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజ దేవి, కల్లూరు మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపిడివో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరు సీహెచ్ సీలో ప్రత్యేక వైద్య సేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.









**మద్దూరు,మున్సిపాలిటీ,(మం) సెప్టెంబర్,25-09(సమయం న్యూస్) :** మద్దూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ వైద్య సేవలతో పాటు ఆర్థోపెడిక్, ఈఎన్ టీ, ఆప్తమాలాజీ లాంటి ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం మద్దూరు పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గైనిక్, పీడియాట్రిక్, ల్యాబ్, మేల్ వార్డ్, ఫార్మాసిస్ట్, ఆపరేషన్ థియేటర్, ఇంజెక్షన్ గది, జనరల్ వార్డు, డ్రగ్ స్టోర్ గదులను పరిశీలించారు. చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న పలువురు చిన్నారులు తల్లులతో కలెక్టర్ మాట్లాడి ఆ చిన్నారుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల వైద్య సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. మద్దూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ఒక మోడల్ కేంద్రంగా ఉండాలని ఆస్పత్రిలో వారానికి రెండు రోజులు ఆర్థోపెడిక్, ఈఎన్ టీ వైద్య నిపుణులను పిలిపించి వైద్య సేవలు అందించాలన్నారు. గురువారం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అర్థో వైద్య నిపుణునితో మాట్లాడి అర్థో కు సంబంధించిన రుగ్మతలతో ఎంత మంది రోగులు వస్తున్నారని వాకబు చేశారు. వచ్చే నెల నుంచి ఆర్థోపెడిక్, ఈ ఎన్ టీ సేవలతో పాటు ఆప్తమాలాజీ వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జున్ కు కలెక్టర్ సూచించారు. అలాగే ఆస్పత్రికి మంజూరైన ఎక్స్ రే యూనిట్ ను తొందరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఆస్పత్రి రెండో అంతస్తులో వినియోగంలో లేని రెండు విశాలమైన వార్డులలో ఫ్లోరింగ్ పనులను కాడా నిధుల నుంచి పూర్తి చేయించేందుకు ప్రతిపాదించాలని కలెక్టర్ చెప్పారు. అలాగే ఆస్పత్రి లోని వార్డుల్లో నేమ్ బోర్డులను మార్చి, ఏ వార్డులో ఏ విభాగం వైద్యులు ఉంటారని తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయించాలని, ఆస్పత్రి లో లోఓల్టేజి సమస్య ను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో పావని, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనతో నిజాంపేట్ కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపుర్ సమయం న్యూస్ సెప్టెంబర్ 25 :** ఈరోజు నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి .వివేకానంద్ గారు అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీరా నీటి నిర్వహణ, బిల్లులు, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి కాలనీలలో నిలిచిపోవడం, నత్త నడకన సాగుతున్న బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే గారు అధికారులతో సమీక్షించారు.

అనంతరం ఎమ్మెల్యేగారు మాట్లాడుతూ... గత పదకొండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లు, కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంజీరా నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుతో పాటు చెరువుల పునరుద్ధరణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరు-స్తున్నారు. బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాక మౌలిక వసతుల కల్పనలో భాగంగా టెండర్లు పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజా ఆరోగ్యంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు...నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతి నగర్, నిజాంపేట్ ప్రాంతాలలోని అన్నీ కాలనీలలో శానిటేషన్ నిర్వహణ సరిగాలేదని, శానిటేషన్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లలో పెరుగుతున్న దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్ ను విధిగా నిర్వహించాలి.

**చెరువులు, పార్కుల సుందరీకరణ..**చెరువుల సుందరీకరణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది చెరువులకు 22 కోట్లు, ఐదు పార్కుల అభివృద్ధికి 10 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలి.

**స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు.**

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరచాలి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ

● అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి




**ఖమ్మం, సెప్టెంబర్ 25 :( సమయం న్యూస్ )** పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. భూముల మార్కెట్ విలువ సవరణ, నిషేధిత భూముల జాబితా రిజిస్టర్ (22(ఎ)), భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, రేషన్ షాపుల పర్యవేక్షణ, జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములను మ్యూటేషన్ చేయడం వంటి పలు అంశాలపై అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ వారీగా అధ్యయనం చేసి భూముల విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. భూముల విలువ సవరణ ప్రతిపాదనలు సహేతుకంగా తయారు చేయాలని, పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ పకడ్బందీగా నిర్ణయించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారులకు సంబంధించి సేకరించిన భూముల మ్యూటేషన్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సేకరించిన భూములను ఆయా శాఖల పేరు మీద మ్యూటేషన్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో ఉన్న భూముల మ్యూటేషన్ తక్షణం పూర్తి చేయాలని అన్నారు.

22(ఎ) రిజిస్టర్ రూపకల్పనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ భవనాల వివరాలు డోర్ నెంబర్ తో సహా వీటిలో నమోదు చేయాలని అన్నారు. భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అర్హులకు భూ హక్కులను కల్పించాలని అన్నారు. మండలంలో ఉన్న రేషన్ షాపులను తహసిల్దార్ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అన్నారు. రేషన్ షాపులను ప్రభుత్వం ఆథరైజ్ చేసిన డీలర్లు మాత్రమే నడపాలని అన్నారు. అక్టోబర్ చివరి నాటికి జిల్లాలో ఉన్న అన్ని రేషన్ షాపులను తనిఖీ పూర్తి చేసి నివేదిక అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్ లు, తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

● తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి- గంటి సురేష్ కుమార్



**కొడంగల్: మున్సిపాలిటీ(మం)సెప్టెంబర్ 25-09 (సమయం న్యూస్) :** వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కోడంగల్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు వర్షాలతో దెబ్బ తినడంతో నిరాశే మిగిలిందన్నారు. ఏ పంటలు వర్షానికి దెబ్బతిన్నాయో ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సమాచారం తీసుకుని జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు.

# శిశు గృహ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

● చిన్నారులకు తల్లి లాంటి ప్రేమ అందించాలి



**మహబూబ్ నగర్ సెప్టెంబర్2( సమయం న్యూస్).:** శిశుగృహ పిల్లలకు తల్లిలా ప్రేమను పంచాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. కలెక్టర్ విజయేందిర బోయి గురువారం శిశుగృహాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు. పిల్లల హెల్త్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక్కోక్కరికి చిన్నారి హెల్త్ ప్రొఫైల్ పరిశీలించారు. వయస్సు వారిగా పిల్లలని వేరు చేసి వారి గ్రోత్ పై మానిటరింగ్ చేయాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులకు స్పెషల్ డైట్ ఇవ్వాలన్నారు. పిల్లల బట్టల విషయంలో మరింత శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఇంటి వాతావరణంలో పిల్లలను పెంచాలని, ప్రత్యేకగా ఏర్పాటు చేసిన పార్కులో పిల్లలను ఆడించాలని చెప్పారు. శిశుగృహ చిన్నారులకు అవసరమైన సౌకర్యాల కోసం నిధులు సమకూరుస్తానని చెప్పారు. అనంతరం స్టేట్ హోం ప్రాంగణంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ హోమ్ భవన నిర్మాణ పనులను, మరమ్మత్తులు చేసిన మీటింగ్ హాల్ పనులను పరిశీలించారు. ప్రాంగణంలో పాతబడిపోయిన అర్బన్, రూరల్ సిడిపిఓ ఆఫీసుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట డిడబ్ల్యుఓ జరీనా బేగం, సీడిపీఓ శైల శ్రీ, డిసిపిఓ నర్మద, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాములు, శిశుగృహ సిబ్బంది ఉన్నారు.

# 17 మద్యం దుకాణాలను రిజర్వేషన్ క్రింద కేటాయించడం జరిగింది

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.
- జిల్లా లో నూతనమద్యం పాలసి 20 25 -27 సంవత్సరానికి గాను
- 59 మద్యం దుకాణాలకు సంబంధించి




**వికారాబాద్: సెప్టెంబర్,25-09(సమయం న్యూస్):** మద్యం దుకాణాలకు సంబంధించి 17 మద్యం దుకాణాలను రిజర్వేషన్ క్రింద కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు. గురువారము విడియో కాన్ఫరెన్సు హాలు నందు అబ్కారి శాఖ అధ్వర్యంలో చేపట్టిన వికారాబాద్ జిల్లాలో నూతన మద్యం దుకాణాల కేటాయింపు లో ఎస్సి క్యాటగిరి కి 9,ఎస్ టి క్యాటగిరి కి 2,గౌడ కులాలకు 6 కేటాయించడము జరిగింది. మిగతా 42 మద్యం దుకాణాలకు ఓపన్ క్యాటగిరి క్రిందకు వస్తాయన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు మూడు లక్షల రూపాయలు (నాన్ రిపెండబుల్ అమౌంట్ )డి డి చలాన్ ద్వార దరకాస్తు చేయవచ్చు నని తెలిపారు. ఈ నెల 26నుండి అక్టోబర్ 18 వరకు అప్లికేషన్లు స్వీకరించ బడునని తెలిపారు.లాటరి ఎంపిక తేది: 23-10 -2025 జిల్లా కాల్లెక్ట్రేట్ కార్యాలయంలో నిర్వహించబడునని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ,సుపరింతెన్దేంట్ విజయ బాస్కర్, డి టి డి ఓ కమలాకర్ రెడ్డి,బి సి వెల్ఫేర్ మాడవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక వర్గాలకు లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయింపు.

- జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి.



**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 25( సమయం న్యూస్). :** మహబూబ్ నగర్జిల్లా కలెక్టర్ విజయే%శీ%దిర బోయి గారి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్, నారాయణ పేట జిల్లాలకు సంబందించిన (90) మద్యం షాపుల లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం గౌడ సామాజిక వర్గాలకు రిజర్వేషన్ కల్పిస్తూ లాటరీ పద్దతిలో లకు (03), లకు(10), గౌడ లకు (14) మద్యం దుకాణాలు రిజర్వ్ చేయడం జరిగింది. ఇట్టి మద్యం దుకాణాల కాలపరిమితి 01.12.2025 నుంచి 30.11.2027 వరకు ఉంటుంది.జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.సుధాకర్,తదితరులు పాల్గొన్నారు

# సీతాయిపేట్ లో అట్టహాసంగా ఇందిరమ్మ గృహ ప్రవేశాలు



- ప్రారంభోత్సవాలు చేసిన రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్

**నిజామాబాద్, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్)** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలం సీతాయిపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. వేద బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా పూజలు జరిపించి, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులైన మానస, స్వరూప, నిశాంత్, సాయిరాం, గంగాధర్ లను వారి కుటుంబ సభ్యులతో కలిసి గృహ ప్రవేశాలు చేయించారు. రూరల్ నియోజకవర్గంలో మొట్టమొదటి ఇందిరమ్మ గృహ ప్రవేశాలు కావడంతో ఎమ్మెల్యే భూపతి రెడ్డి లబ్దిదారులకు తన తరపున స్వయంగా నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ లు లబ్ధిదారులకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో సొంతింటి కల సాకారం చేసుకోగలిగామని లబ్దిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాగా, లబ్దిదారులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందాయా? ఇంటి నిర్మాణం విషయంలో అధికారులు తోడ్పాటును అందించారా? అని కలెక్టర్ లబ్దిదారులను ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్, తాగునీరు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా లబ్దిదారులు కూడా త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఇళ్లను కట్టుకోవాలని, అనవసర ఆర్భాటాలకు పోయి అప్పుల పాలు కాకూడదని కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య.
- తహసిల్దార్ కార్యాలయం నుండి వచ్చే ప్రతి ఫైల్ నిర్ణీత ప్రొఫార్మాలో పంపాలి.
- ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష.



**సంగారెడ్డి సెప్టెంబర్25( సమయం న్యూస్). :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంట, వెంట అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ పి ప్రావీణ్య, రెవెన్యూ అధికారులను ఆదేశించారు ఆదేశించారు. గురువారం జిల్లా లోని ఆర్ డి ఓ లు, తహశీల్దార్ల తో కలెక్టరేట్ సమావేశమం దిరంలోభూభారతి అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు నిర్ణీత ప్రొఫార్మాలో అవసరమైన పూర్తి వివరాలు జత చేసి తాసిల్దార్ కార్యాలయం నుండి ఆర్డిఓ కార్యాలయానికి ఆర్డిఓ కార్యాలయం నుండి కలెక్టరేట్ కు పంపించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఇప్పటివరకు భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు . నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి సంబంధిత స్థలాలను పరిశీలించి విచారణ జరపాలని అధికారులకు సూచించారు. వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ, జీఐఎస్ ఆధారిత సర్వే డిజిటైజేషన్ వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి, భూ రికార్డులను పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాదా బైనామాలు కు సంబంధించి పూర్తి వివరాలతో వచ్చిన దరఖాస్తు అన్నిటికి సంబంధించిన ఫైళ్లను అన్ని సిద్ధం చేసుకోవాలని తెలిపారు .కలెక్టరేట్ వచ్చిన ఫైళ్లను కలెక్టరేట్ కు సంబంధించి సెక్షన్ అధికారులు క్షుణ్ణంగా సెక్షన్ అధికారులు వచ్చిన ఫైల్ కు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన ఫైల్ నోట్లు రాసి సిద్ధం చేయాలన్నారు . ఒకవేళ ఫైల్ రిజెక్షన్ అయితే ఎందుకు రిజెక్షన్ చేశాము, అన్న వివరాలు సైతం నమోదు చేయా ల్సిన అవసరం ఉందన్నారు . తాసిల్దార్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయాల నుండి వచ్చిన ఫైళ్లను జిల్లా స్థాయిలో రూపొందించిన నిర్ణీత ప్రొఫార్మ ప్రకారం సంబంధిత ఫైల్స్ రానున్న 15 రోజుల్లో భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాల న్నారు. ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) మాధురి , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి / జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా , అందోల్ ఆర్డీఓ పాండు , సంగారెడ్డి ,జి.రాజేందర్ ,జిల్లా లోని తహసీల్దార్లు పాల్గొన్నారు .

# నూతన మద్యం పాలసీ ప్రకారంగా షాపుల కేటాయింపు



**మెదక్ సెప్టెంబర్ 25( సమయం న్యూస్) :** తెలంగాణ నూతన మద్యం పాలసీ (2025-27 )లో భాగంగా జిల్లాలో 49 మద్యం షాపుల నిర్వహణకు ఎస్సీ, ఎస్టీ మరియు బిసి గౌడ కులస్తుల రిజర్వేషన్ ఎంపిక కొరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో వీడియోగ్రఫీ మధ్య జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్టీ అభివృద్ధి శాఖ మరియు బీసీ అభివృద్ధి శాఖల అధికారుల సమక్షంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వారు డ్రా నిర్వహించారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో బీసీ గౌడ సామాజిక వర్గానికి ( 09), ఎస్సీ సామాజిక వర్గానికి (06), ఎస్టీ సామజిక వర్గానికి ( 01)లాటరీ ద్వారా మద్యం షాపులను ఎంపిక చేసి వాటి ఆమోదానికి రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ కు పంపిస్తున్నట్లు పూర్తి గెజిట్ రేపు ఇవ్వడం జరుగుతుందని అన్నారుమిగతా 33 షాపులు ఓపెన్ క్యాటగిరిలో ఉంచడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీనివాసరావు జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీష్ జిల్లా ఎస్టీ అభివృద్ధి అధికారి నీలిమ మరియు ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుద్యాల గేట్ వద్ద కోడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్




**దుద్యాల మండలం, సెప్టెంబర్,25-09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కోడంగల్ పట్టణంలో ముస్లింల కబ్రస్తాన్, దర్గా తొలగింపుపై ర్యాలీ నిర్వహించాలనుకున్న బీఆర్ఎస్ తెల్లవారుజాము నుండే అన్ని మండలాల్లో బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు.ర్యాలీకి బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి,తో సహా బీఆర్ఎస్ నేతలను దుద్యాల గేటు దగ్గర అరెస్టు చేసి దోమ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు

# స్వచ్ఛత అనేది ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**కొత్తగూడెం సెప్టెంబర్25( సమయం న్యూస్) :** స్వచ్ఛత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడు నిరంతరం ఆచరించాల్సిన బాధ్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పరిశుభ్రతా కార్యక్రమాలు సమాజంలో నిత్యకృత్యంగా కొనసాగితేనే ఆరోగ్యవంతమైన, శుభ్రమైన, పచ్చదనంతో కూడిన వాతావరణం ఏర్పడుతుందని ఆయన పౌరులకు పిలుపునిచ్చారు.భారత ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్రత్యేక శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఆవరణలో గడ్డిని, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రతను కాపాడే దిశగా అందరూ కలసికట్టుగా శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇంటి నుండి సమాజం వరకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి ఇంటి వద్దే చెత్తను వేరు వేరు డబ్బాలలో వేసి సక్రమంగా పారవేయాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయరాదు అని అన్నారు. మురుగు కాలువల్లో చెత్త పడితే నీటి ప్రవాహం ఆగిపోతుంది, దాంతో దోమల పెరుగుదల, పలు రకాల వ్యాధుల వ్యాప్తి జరుగుతుంది కాబట్టి ఈ విషయంపై ప్రతి పౌరుడూ జాగ్రత్తగా ఉండాలి అని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతేనని, సమాజం పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణంలోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులతో పాటు విద్యార్థులు, యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటే భవిష్యత్ తరాలకు పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన సమాజాన్ని అందించగలమని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛతకు కట్టుబడి ప్రతిజ్ఞ చేసి, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కట్టుబడి ముందడుగు వేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఏడి మైన్స్ దినేష్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ ఏడి రమేష్, మెప్మా పీడీ రాజేష్ మరియు జిల్లా ఉద్యోగులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీ ఎం జన్ మన్ లో చేపట్టిన పనులు పూర్తి చేయండి.

## కేంద్ర గిరిజన శాఖ కార్యదర్శి విభూ నాయర్




**నిర్మల్ సెప్టెంబర్ 25( సమయం న్యూస్.) :** పీఎం జన్ మన్ కార్యక్రమంలోని అన్ని పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూ నాయర్ కలెక్టర్లను ఆదేశించారు. పీఎం జన్ మన్ (ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్) కార్యక్రమం అమలుపై గురువారం ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని పలువురు కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభూ నాయర్ మాట్లాడుతూ, గిరిజన ప్రజల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పీఎం జన్ మన్ కింద ఆధార్ కార్డుల నమోదు, ఆయుష్ కార్డులు, జన్ ధన్ ఖాతాల వినియోగం, పక్కా గృహాల నిర్మాణం, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలను కలెక్టర్లు పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. ఆది కర్మయోగి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే స్థల సేకరణ, మౌలిక వసతుల నిర్మాణ పురోగతి అంశాలను వివరంగా తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ, పీఎం జుగా, దర్తి అబా, ఆది కర్మయోగి కార్యక్రమాల్లోని అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేసి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లాలోని 24 హాబిటేషన్లలో 771 పక్కా గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆది కర్మయోగి కింద 9 బ్లాకులు, 32 హాబిటేషన్లలో గిరిజన ప్రజల అభివృద్ధి కోసం ఐదేళ్ల ప్రత్యేక కార్యాచరణ అమలు పరుస్తామని చెప్పారు. అదేవిధంగా ఆది సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి గిరిజన సమాజానికి నూతన అంగన్వాడీలు, వసతి గృహాలు, మల్టీ పర్పస్ సెంటర్లు, ప్రైమరీ పాఠశాలలు, రోడ్డు కనెక్టివిటీ వంటి మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు ప్రారంభించామని కలెక్టర్ వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లాటరీ ద్వారా వైన్స్ షాపుల రిజర్వేషన్ కేటాయింపు ఖరారు

## • జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి , సెప్టెంబర్ 25( సమయం న్యూస్). :** లాటరీ పద్ధతి ద్వారా జిల్లాలో వైన్స్ షాపు రిజర్వేషన్ కేటాయింపు ఖరారు చేసామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు వైన్స్ షాపుల రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను గురువారం కలెక్టరేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న 74 ఏ4 వైన్స్ షాపుల్లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గౌడ కులస్థులకు 13 షాపులు, ఎస్సీలకు 8 షాపులు రిజర్వ్ చేసి సదరు షాపులను లాటరీ ద్వారా కేటాయిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పారదర్శకంగా రిజర్వ్ వైన్ షాపులు కేటాయించే విధంగా మొత్తం ప్రక్రియను వీడియోగ్రాఫీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు మధ్యం షాపులు కేటాయించే సమయంలో గౌడ కులస్థులకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వం గౌడ కులస్థులకు 13 షాపులు, ఎస్సీలకు 8 షాపులు కేటాయించిందని తెలిపారు. జిల్లాలో గౌడ కులస్థులకు షాపు నెం. లను, ఎస్సీలకు షాపు నెం. లను లాటరీ ద్వారా కలెక్టర్ ఎంపిక చేసారు జిల్లాలో మిగిలిన 53 షాపులకు అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ 1,2025 నుంచి నవంబర్ 30,2027 వరకు ప్రస్తుతం కేటాయించే షాపుల లైసెన్స్ ఉంటుందని, ప్రతి షాపు కు రూ.3 లక్షల నాన్ %-% రిఫండబుల్ దరఖాస్తు రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వైన్ షాపు కేటాయింపు ప్రక్రియ నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ మొదలైన అంశాల షెడ్యుల్ ను అబ్కారీ శాఖ కమిషనర్/సంచాలకులు ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అబ్కారీ శాఖ సూపరిండెంట్ మహిపాల్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మండల రవీందర్, ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

# పరిశుభ్రతకై వారంలో ఒకరోజు శ్రమదానం చేయాలి

## • ప్రజలకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ పింకేష్ కుమార్



**జనగాం సెప్టెంబర్25( సమయం న్యూస్).:** పరిశుభ్రత కొరకు వారంలో ఒకరోజు శ్రమదానం చేపట్టి స్వచ్ఛతాహి సేవకు బాసటగా నిలవాలని జిల్లా కలెక్టర్ పింకేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమ అమలులో భాగంగా 17వ స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమ అమలులో భాగంగా 2025, సెప్టెంబర్ 17వ తేదీ నుండి 2వ తేదీ అక్టోబర్ మహాత్మా గాంధీ జయంతి వరకు జరుగుతున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలలో భారత దేశ ప్రధాన మంత్రి దామోదర దాస్ నరేంద్రమోది పిలుపుమేరకు జనగామ మండలం శామీర్పేట గ్రామంలో నిర్వహించిన ఏక్ దిన్ ఏ గంట ఏక్ సాత్ అనే కార్యక్రమం పురస్కరించుకొని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ విచ్చేసి శ్రమదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలచే కలిసి కలెక్టర్ ఒక గంట పాటు శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్ గ్రామంలో దేవీ నవరాత్రులని జరుపుతున్న సందర్భంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ పండాల్ / స్వచ్ఛ మండపంలో కలెక్టర్ చేత ప్రత్యేక పూజలు జరిపించి తదనంతరం గ్రామ ప్రజలందరి చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లికనీసం వారంలో మీకోసం మీరు మీ ఇంటిలో మీ వాడలో ఒక గంట పాటు శ్రమదానం చేస్తే అది మీ ఇంటి ఆరోగ్యానికి సోపానం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత కొరకు శ్రమదానం చేపట్టి స్వచ్ఛత పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గ్రామ పారిశుధ్య కార్మికులకి కలెక్టర్ శాలువాలచే సన్మానం చేసి ప్రత్యేకంగా అభినందిస్తూ స్వచ్ఛతాహి సేవ టీ షర్ట్స్, క్యాప్స్ అందించారు. అంతకుముందు జిల్లా పంచాయతీ అధికారి స్వరూప , జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ కరుణాకర్ , జిల్లా అదనపు పీడి చంద్రశేఖర్ , ఎంపీడీవో సంపత్ , పంచాయతీ కార్యదర్శి స్వప్న లు కలెక్టర్ కు స్వచ్ఛ బతుకమ్మ తో స్వాగతం పలుకుతూ స్వచ్ఛ బతుకమ్మ ఆట ఆడి స్వచ్ఛత నినాదాలు చేసారు. ర్యాలీగా వెళ్లి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శంకరయ్య , గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీనరీ పనుల ఏర్పాటు పై దృష్టి సారించండి

## • నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
## • కమిషనర్ తో కలిసి వివిధ అభివృద్ధి
## •పనుల పురోగతి పై సమీక్ష....



**వరంగల్ సెప్టెంబర్ 25( సమయం న్యూస్).:** నగరం లో పూర్తి స్థాయి లో గ్రీనరీ పనుల ఏర్పాటు పై దృష్టి సారించాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో వివిధ విభాగాల అభివృద్ధి పనుల సమీక్ష పై ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని సెంట్రల్ మీడియం పనులు, పార్క్ లతో పాటు ఇతర గ్రీనరీ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని, ఇంజనీరింగ్ సంబంధిత పనులలో భాగం గా టెండర్లు, అగ్రిమెంట్ లు పూర్తి చేసి ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకొని మాట్లాడుతూ టెండర్లు పూర్తి అయిన పనులకు సంబంధించి వెంటనే పనులు మొదలు పెట్టాలని టెండర్లు పూర్తి కానీ పనులకు వెంటనే టెండర్లు ఆహ్వానించాలని సెంట్రల్ మీడియన్ లలో దెబ్బతిన ప్రాంతాలను పునరుద్ధరించి కొత్త గా గ్రీనరీ లేని ప్రాంతాలను గుర్తించి ఏర్పాటు చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి సి హెచ్ ఓ రమేష్ ఇంచార్జి ఎస్ ఈ మహేందర్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి ఈ ఈ లు రవి కుమార్ సంతోష్ బాబు మాధవి లత డి ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని

## • జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




**నిర్మల్ సెప్టెంబర్ 25( సమయం న్యూస్) :** గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసిక జిల్లా కన్సాలిటేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి బ్యాంకర్లు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. వెనుకబడిన తరగతుల ప్రజలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులు, వీధి వ్యాపారులు, విద్యార్థులకు రుణ మంజూరులో ఆలస్యం చేయకుండా చూడాలని ఆదేశించారు. అర్హులైన దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రుణాలు అందజేయాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించాలని, విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా అందజేసిన రుణాల వివరాలు, వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకులకు వచ్చే ప్రతి ఒక్కరికీ సమయానుకూలంగా, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, నాబార్డు డిడిఎం వీరభద్రుడు, ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్, ఆయా శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# శ్రీ గురు పీఠంలో విశేషపూజలు.

## • శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్
## • పెద్దగోని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు



**శివ్వంపేట్ సెప్టెంబర్ 25 ( సమయం న్యూస్) :** గూడూరు శ్రీగురుపీఠంలో భక్తులు మొట్టమొదటి దత్తావదారులు స్వామివారికి గురువారం అభిషేకం, అర్చనలు నిర్వహించడం జరిగినది. శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు పౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో దివ్యమూర్తులైన శ్రీదత్తాత్రేయ స్వామి, షిరిడి సాయినాథునికి భక్తులు విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా శ్రీగురుపీఠం ట్రస్టు చైర్మన్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ శ్రీపాదవల్లభ స్వామి జననం పరమ పవిత్రమైనదని, శ్రీపాదవల్లభుల దర్శనం భాగ్యంతో పాటు రోజంతా స్వామివారి నామస్మరణ చేస్తే సర్వ అరిష్టాలు తొలగిపోతాయని ఆయన తెలిపారు. శ్రీసాయినాథ స్తవన మంజరి పూర్తి చేసిన రోజు అయినందున భక్తులు స్వామివారి దర్శనం చేసుకోవడం పూర్వ జన్మ సుకృతమని ఆయన అన్నారు. అనంతరం శ్రీగురుపీఠం ట్రస్టు తరుపున భక్తులకు కొడకంచి సుదర్శన్ గౌడ్ మరియు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ ఇద్దరు సమిష్టి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో శ్రీగురుపీఠం ట్రస్టు సభ్యులు, ఇతర గ్రామాల నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యూష సారీ ఫంక్షన్ లో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి!

## • సేవా రత్న అవార్డు గ్రహీత బండారి సంతోష గంగాధర్!!



**శివంపేట్ సెప్టెంబర్ 25 (సమయం న్యూస్) :** శివంపేట మండల కేంద్రంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు కూతురు ప్రత్యూష సారీ ఫంక్షన్ కు ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి ,ప్రముఖ సంఘ సేవకులు బీసీ నాయకులు బండారి సంతోష గంగాధర్ నాయిని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు స్వామి కాంగ్రెస్ నాయకులు బండారి ముత్యాలు , బండారి యాదగిరి బండారి శ్రీను, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి నాగేష్.పిల్లి నరేష్. పిల్లి అంజయ్య.

గొల్లపల్లి పెద్ద నరసన్న. మంగలి శ్రీను. బండారి సాయి కిరణ్. బండారి శ్రీకాంత్. గాండ్ల దాసు. మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత వెజ్ & నాన్ వెజ్ మార్కెట్ ని వినియోగం లోకి తీసుకొని రావాలని

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యపేట సెప్టెంబర్,25( సమయం న్యూస్,):** గురువారం సూర్యాపేట పట్టణంలోని సమీకృత వెజ్ % నాన్ వెజ్ మార్కెట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలింఛారు. గాలి వెలుతురు రావట్లేదని వ్యాపారస్తులు మార్కెట్ ని వినియోగించటం లేదని దానికి ప్రత్యామ్నాయంగా గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేసి వ్యాపారస్తులు క్రయ విక్రయాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. వచ్చే శనివారం రోజు మార్కెటింగ్ అధికారులతో, మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి మార్కెట్ ను ప్రజలకు ఉపయోగపడే విదంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ 31 కోట్ల రూపాయలతో నిర్మించిన వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ కార్యాలయం రైతులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ కే సీతారామారావు, ఆర్డీఓ వేణు మాధవ్, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, మార్కెట్ కార్యదర్శి మహమ్మద్ ఫసియుద్దిన్,మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది హాజరైనారు

# చోరీలకు పాల్పడిన నిందితులకై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయండి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**హన్మకొండ సెప్టెంబర్25( సమయం న్యూస్) :** చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని వారిని అరెస్ట్ చేసి నిందితుల నుండి చోరీ సోత్తును స్వాధీనం చేసుకున్నప్పుడే ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం, గౌరవం పెరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయము సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండిరగ్‌లో వున్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండిరగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన చోరీలపై పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ వున్న అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపోందించుకోవాలని, కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్ అధికారులు అలసత్వం వహించోద్దని, నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సిసి కెమెరాల ఏర్పాటుకై కృషి చేయడంతో సిసి కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నేర చరిత్ర వున్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో వుండాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి వుంటుందని. పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది రోటేషన్ పద్దతిలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్లలో ఆహ్లదకరమైన వాతవరణం కోసం మొక్కల పెంపకంతో పాటు స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రంగా వుంచాలని ఇందుకోసం వారంలో ఒక రోజు శ్రమదానం చేయాల్సి వుంటుందని సిపి పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్‌కుమార్, వరంగల్ , జనగాం ఏఎస్పీలు శుభం, చేతన్‌నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేష్‌కుమార్,తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25( సమయం న్యూస్).::** డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుండి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబరాలు చేశారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాలలో సచివాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సంఘం సభ్యులు శైలజ, మంగ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాలకు అధిక రుణాలు అందించాలి

● అత్యధికంగా పంట రుణాలను ఇవ్వాలి
● లబ్ది దారులకు జాప్యం లేకుండా రుణాలు ఇవ్వాలి
● బ్యాంకర్ల సమావేశం లో సూచించిన
● భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు




**భూపాల పల్లి సెప్టెంబర్25( సమయం న్యూస్) :** రుణ లక్ష్యసాధనకు సమన్వయం అవసరమని శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో బ్యాంకర్లు, అధికారులతో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందేశం ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణ లక్ష్యం 1221.72 కోట్లు కాగా అందులో 136.74 కోట్లు రుణ లక్ష్యం సాధించారన్నారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఈ, హౌసింగ్, ఎడ్యుకేషన్, వ్యవసాయ రుణాలను సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలని అన్నారు. ఆయా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులతో తరుచూ సంప్రదించి రుణ ప్రక్రియ పూర్తి చేయాలి అన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్దిదారులకు అవగాహనా పరిచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో రైతు వేదికలు ఉన్నాయని ప్రతినెల సమావేశాలు చేపట్టి రుణ ప్రగతి పెంచేందుకు మండల స్థాయి అధికారులకు కృషి చేయాలని అన్నారు. అత్యధికంగా పంట రుణాలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పుకునేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. పట్టణ ప్రాంతంలో వీధి వ్యాపారులకు రుణాలు సకాలములో ఇవ్వాలన్నారు. ఇదేవిధంగా రుణ లక్ష్యాలను పెంచుతూ ఇదే దిశగా రుణాలను పెంచుతూ అత్యధిక మంది నిరుపేదలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు సహకరించాలన్నారు. విద్యారుణాలు అధిక మొత్తంలో ఇవ్వాలని విద్యాభివృద్ధి కృషి చేయాలన్నారు. రికవరీ శాతం పెంచినపుడే బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తాయని అధికారులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. మహిళశక్తిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు మోడల్ సి ఎస్ సి సెంటర్స్ ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిదంగా రుణాలు పొందిన లబ్ధిదారులకు అధికారులు వెన్నంటి ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్.బి.ఐ. ఎల్.డి.ఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ దిజిఎం, టిజిబి ఆర్ ఎం, జిల్లా అధికారులు, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి మరియు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**హైదరాబాద్ సెప్టెంబర్25( సమయం న్యూస్).:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఔన్నత్యానికి బతుకమ్మ పండగ ప్రతీక అని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మహిళా ఉద్యోగులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ ప్రకృతితో ముడిపడి ఉన్న ఒక ప్రత్యేకమైన పూల పండగ అని అన్నారు. తెలంగా సామూహిక జీవన విధానానికి, ప్రజల ఐక్యతకు బతుకమ్మ పండగ నిదర్శనమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు

బతుకమ్మలను అందంగా పేర్చిన మహిళలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మెమెంటో లు అందించి అభినందించారు. కార్యక్రమంలో జూబ్లీ హిల్స్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు

# జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి గారిని పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు గారు





**వరంగల్ సెప్టెంబర్ 25. (సమయం న్యూస్):** వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదా దేవి ఐఏఎస్ గారి అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా నేడు హైదరాబాద్ అశోక్ నగర్ లోని వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు.

# మొదటి దశ మెట్రో స్వాధీననని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.

**హైదరాబాద్ సెప్టెంబర్25( సమయం న్యూస్).:** హైదరాబాద్ లో మెట్రో రైలు సేవలను విస్తరించేందుకు.. ఇప్పుడున్న మొదటి దశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు.

గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జరిగిన సమావేశంలో ఎల్ అండ్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సలహాదారు ఎన్.వి.ఎస్. రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎంఏయూడీ సెక్రెటరీ ఇలంబర్తి, హెచ్ఎంఆర్ఎల్ ఎండి సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం సెక్రెటరీ మాణిక్యరాజ్ పాల్గొన్నారు. ఎల్ అండ్ టీ గ్రూప్ సిఎండి ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్, సీఎండీ సలహాదారు డి.కె. సేన్, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ, సిఈవో కె.వి.బి.రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల సందర్భంగా మెట్రో రైలు ఫేజ్ 1లో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇప్పుడు ఎల్ అండ్ టీ మెట్రో పై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ. 13,000 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించనుంది. దీంతో పాటు తమ కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ. 2,000 కోట్లు వన్%-%టైమ్ చెల్లింపు అందించాలని ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతిపాదించింది. ఈ చెల్లింపు పూర్తి చేసిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వస్తుంది. 2014లో దేశంలో మెట్రో రైలు నెట్‌వర్క్ లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం తొమ్మిదవ స్థానానికి పడిపోయింది. హైదరాబాద్ గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫేజ్ 2% విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త మెట్రో లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన మెట్రో విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయి. ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న ఫేజ్ 1 మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫేజ్ 2 విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవసరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం (Definitive Agreement) కావాలని కేంద్రం స్పష్టం చేసింది. ఫేజ్ 2లో కూడా ఎల్ అండ్ టీ భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్ఠంభనను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మెట్రో ఫేజ్ 2లోనూ ఎల్ అండ్ టీ భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఫేజ్ 1 మరియు ఫేజ్ 2 కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు ఖచ్చితమైన ఒప్పందం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఒప్పందం కుదిరితేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ వ్యయాల భాగస్వామ్యంలో స్పష్టత ఉంటుందని సీఎం అన్నారు. రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందువల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టీ సీఎండీ అన్నారు. 2002 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ. 3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2100 కోట్లు బకాయి ఉందని గుర్తు చేశారు.

చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 1 మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంతమవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు.

26-09-25 Samayam_Layout 1 9/26/2025 9:45 AM Page 11



# వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం జట్టు ప్రకటన

## రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లకు దక్కని చోటు




అక్టోబరు నుంచి వెస్టిండీస్‌తో జరగనున్న టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్టును ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలో పనిచేసిన సెలెక్షన్ కమిటీ 15 మందితో టీమ్‌ను సమకూర్చింది. కానీ, ఇందులో రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ లేకపోవడం టీమ్‌ఇండియా ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేసింది.

రాబోయే వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త టీమ్‌ను ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. విండీస్ జట్టుతో జరగనున్న ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తాడు. గిల్ తొలిసారి స్వదేశంలో జరిగే టెస్టు సిరీస్‌కు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. జూలైలో ఇంగ్లాండ్‌తో జరిగిన మాంచెస్టర్ టెస్ట్ సందర్భంగా కాలి బొటనవేలు గాయం నుంచి ఇంకా కోలుకోని కారణంగా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను జట్టులోకి తీసుకోలేదు. టెస్టు జట్టులో పంత్ లేకపోవడం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. పంత్ ఉంటే టీమ్‌ఇండియా కష్టాల్లో ఉంటే ఆదుకునేవాడని టీమ్‌ఇండియా



ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరోవైపు ఐపీఎల్ లో అద్భుతంగా రాణించిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కూడా జట్టులోకి చేర్చుకోవడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. జట్టులో మిడిల్ ఆర్డర్ బలమైన వీరిద్దరూ లేని టీమ్‌ఇండియాను ఊహించడం కష్టమని వారి ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. 2025 ఆసియా కప్ ఫైనల్ ఆదివారం (సెప్టెంబర్ 28) దుబాయ్‌లో జరిగిన నాలుగు రోజుల తర్వాత అనగా అక్టోబర్ 2 నుండి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో సిరీస్ ఓపెనింగ్ మ్యాచ్ జరుగుతుంది. రెండవ టెస్ట్ మ్యాచ్ అక్టోబర్ 10న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రారంభమవుతుంది.

**వెస్టిండీస్‌తో జరగనున్న ఈ టెస్టు సిరీస్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, యశస్వి జైశ్వాల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ఎన్ జగదీశన్.

# అభిషేక్ సిక్సర్ల రికార్డు..




సూపర్ ఫామ్ లో ఉన్న భారత విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ తన ఖాతాలో మరో అరుదైన రికార్డును వేసుకున్నాడు. బుధవారం దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుతమైన అర్ధ సెంచరీ (37 బంతుల్లో 75, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఈ క్రమంలో అసియాకప్ ఒక ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్ గా కొత్త రికార్డును నెలకొల్పాడు. కేవలం 5 మ్యాచ్ ల్లోనే తను ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ఈ రికార్డు శ్రీలంకకు చెందిన ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. 2008 ఎడిషన్ లో తను 14 సిక్సర్లు బాదడం విశేషం. అప్పుడు ఈ టోర్నీ వన్డే ఫార్మాట్ లో జరిగింది. టోర్నీ ఇప్పటివరకు 16 సిక్సర్లు బాదిన అభిషేక్.. బంగ్లాపై మ్యాచ్ లో ఐదు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తన జోరుతో మైదానంలోని ప్రత్యర్థి బౌలర్లు చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయారు. భారీ సిక్సర్లతో తన జోరును కొనసాగిస్తూ, కేవలం 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అభిషేక్.. సెంచరీ సాధిస్తాడని అభిమానులు ఆశించారు. గత మ్యాచ్ లో కూడా 70ం స్కోరు చేసిన అభిషేక్.. ఈసారి కూడా ఫ్యాన్స్ ను నిరాశపరుస్తూ మళ్లీ 70ం స్కోరుపైనే ఔటయ్యాడు. అయితే ఈసారి రనౌట్ రూపంలో తను ఔటవడం అభిమానులను షాక్ కు గురిచేసింది. ఇక సూపర్-4లో శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్ తోపాటు ఫైనల్ (అర్హత సాధించడం దాదాపు ఖాయమే) మ్యాచ్ ఉండటంతో తన సిక్సర్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని శర్మ అభిమానులు కోరుకుంటున్నారు. ఈనెల 26న లంకతో, ఫైనల్ మ్యాచ్ ఈనెల 28న జరుగుతుంది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ బెర్తు సాధిస్తుందన్న అంచనాతో బరిలోకి దిగిన భారత్.. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసి, భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. నిజానికి ఇన్నింగ్స్ ఆరంభంలో అభిషేక్ చేసిన విధ్వంసంతో ఇండియా భారీ స్కోరు సాధిస్తుందని భావించినా, మిడిలార్డర్ విఫలం కావడంతో అనుకున్నదానికంటే చాలా తక్కువ స్కోరుకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా (29 బంతుల్లో 38, 4 ఫోర్లు, ఒక సిక్సర్)తో సమయోచిత బ్యాటింగ్ తో జట్టుకు మంచి స్కోరును అందించే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ శుభమాన్ గిల్ (29) కూడా వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక బౌలర్లలో రిషాద్ హుస్సేన్ రెండు వికెట్లతో రాణించాడు. ముస్తాఫిజుర్ రహ్మాన్ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా దేశీ ప్లేయర్ గా తను రికార్డులకెక్కాడు.

# ఆస్ట్రేలియా-ఏ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

## కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఎంపిక



ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ జట్టుకు నాయకత్వం వహించనున్నారు. అంతకుముందు, ఆస్ట్రేలియా '%రా%'తో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లో కూడా శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే, రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సమయం ముందు ఆయన ఆకస్మికంగా కెప్టెన్సీని వదులుకుని జట్టు నుంచి విడుదల కావడం చర్చనీయాంశమైంది. రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీని వదులుకోవడానికి ప్రధాన కారణం వెన్ను నొప్పి. గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న శ్రేయస్ అయ్యర్.. మళ్లీ వెన్నులో కొద్దిగా పట్టేసినట్టు , బిగుసుకుపోయినట్టు అనిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే ఆయన రెడ్ బాల్ క్రికెట్ నుంచి ఆరు నెలలు విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఆయన బీసీసీఐకి కూడా తెలియజేశారు. ఆరోగ్య సమస్య ఉన్నప్పటికీ.. ఇప్పుడు వన్డే సిరీస్‌కు సారథిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

**మొదటి వన్డేకు ఇండియా జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్.

**రెండు, మూడు వన్డేలకు ఇండియా జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

**ఇరానీ కప్ కోసం 'రెస్ట్ ఆఫ్ ఇండియా' జట్టు:**

రజత్ పాటిదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్-కెప్టెన్), యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తనుష్ కోటియన్, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, ఆకాష్ దీప్, అన్షుల్ కంబోజ్, సారన్ష్ జైన్.

# పాకిస్థాన్ ఆటగాళ్లపై ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు








భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ లో అతిగా ప్రవర్తించిన ఆ ఇద్దరు పాక్ క్రికెటర్స్ పై భారత్ క్రికెట్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈవిషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ-మెయిల్ రూపంలో ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. పాక్ ప్లేయర్లు హారిస్ రవూఫ్, ఫర్హాన్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉంది. వారు ఇవ్వని పక్షంలో ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ఎదుట వాదనలు వినిపించాల్సిన అవసరం ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత గన్‌షాట్ చూపిస్తూ హావభావాలు ప్రదర్శించాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి చేష్టలకు పాల్పడటం విమర్శలకు దారితీసింది. తన సెలబ్రేషన్స్‌ను ఫర్హాన్ సమర్థించుకొనేందుకు ప్రయత్నించాడు. అప్పటికప్పుడు అలా సంబరాలు చేసుకున్నా..బయట ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను అని వ్యాఖ్యానించాడు. హారిస్ రవూఫ్ ఏకంగా జెట్ ఫ్లైట్‌లు కూలినట్లు 6-0 అని సైగలు చూపించాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్ విమానాలను తమ సైన్యం కూల్చేసిందని పాక్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. దానిని గుర్తు చేసేలా హారిస్ చేష్టలు ఉన్నాయనేది ప్రధాన విమర్శ. ఇక భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తో వాగ్వాదానికీ దిగాడు. ఇప్పటికే రిఫరీ విషయంలో అవమానాలు ఎదుర్కొన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారత్‌పై అక్కసును మాత్రం వదలట్లేదు. టీమ్‌ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో పాక్‌పై భారత్ విజయం సాధించింది. ఆ గెలుపును పహల్గాం ఉగ్రదాడి బాధితులు, భారత సైన్యానికి అంకితం ఇస్తున్నట్లు సూర్య వెల్లడించాడు. ఇప్పుడు అదే పాక్ కడుపు మంటకు కారణమైంది. సూర్య వ్యాఖ్యలు రాజకీయపరంగా ఉన్నాయంటూ ఐసీసీ దృష్టికి పీసీబీ తీసుకెళ్లింది.

# ఫైనల్ ముందు టీమిండియాను వెంటాడుతున్న భయం ఏంటి?

ఆసియా కప్ 2025లో టీమిండియా అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా గ్రూప్ దశలో అప్రతిహతంగా విజయాలను సాధించింది. సూపర్-4 రౌండ్‌లోనూ బలమైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లను వరుసగా ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు బలంగా కనిపిస్తున్నా.. భారత జట్టును ఓ భయం వెంటాడుతోంది. అదే.. దారుణమైన ఫీల్డింగ్ వైఫల్యం. టీమిండియా వరుసగా 2 సూపర్-4 మ్యాచ్‌లలో చేసిన ఈ పెద్ద పొరపాటే ఫైనల్లో టైటిల్‌ను దూరం చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాకిస్తాన్ జట్టుతో జరిగిన కీలకమైన సూపర్-4 మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు చూపించిన ప్రదర్శన ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. జట్టు ఏకంగా 5 క్యాచ్‌లు వదిలేసింది. అంతే కాకుండా ఓ సులవైన రనౌట్ అవకాశాన్ని కూడా కోల్పోయింది. అంటే 6 వికెట్లు తీసే అవకాశాలను వదులుకోవడం ప్రపంచ స్థాయి జట్టుగా పేరున్న భారత్ కు తగని విషయం. ఈ వైఫల్యం జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. పాకిస్థాన్‌పై చేసింది ఒక్క మ్యాచ్ పొరపాటు అనుకుంటే.. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఫీల్డింగ్‌లో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఆ మ్యాచ్‌లోనూ భారత ఆటగాళ్లు 5 క్యాచ్‌లు వదిలేశారు. ఇందులో అత్యంత విచిత్రమైన అంశం ఏమిటంటే, ఈ 5 క్యాచ్‌లలో ఏకంగా నాలుగు క్యాచ్‌లు కేవలం ఒకే బ్యాట్స్‌మెన్ సైఫ్ హసన్ ఇచ్చినవే. "క్యాచెస్ విన్ మ్యాచెస్" (క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి) అనే సూత్రం క్రికెట్‌లో అందరికీ తెలిసిందే. సూపర్-4 మ్యాచ్‌లలో తక్కువ బలమైన జట్లపై ఈ పొరపాట్లు చేసినా విజయం సాధించినప్పటికీ, ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లలో ఇలాంటి చిన్న పొరపాటు కూడా జట్టుకు భారీ నష్టాన్ని, టైటిల్‌ను కోల్పోయే ప్రమాదాన్ని కలిగించవచ్చు. ప్రపంచ స్థాయి జట్టుగా ఉన్న టీమిండియా ఫైనల్‌కు ముందు తమ ఫీల్డింగ్ లోపాలను తక్షణమే సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే, అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ చేరినా.. కప్పు గెలిచే అవకాశం చేజారే ప్రమాదం ఉంది. ఫైనల్‌లో టీమిండియా తమ ఫీల్డింగ్‌ను పటిష్టం చేసుకొని టైటిల్‌ను గెలుచుకుంటుందో లేదో వేచి చూడాలి.

# బిగ్ బాష్ లీగ్‌లోకి రవిచంద్రన్ అశ్విన్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్ బౌలర్లలో ఒకరైన రవిచంద్రన్ అశ్విన్.. ఆస్ట్రేలియాలోని ప్రముఖ బిగ్ బాష్ లీగ్ టీ20 టోర్నమెంట్‌లో ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సిడ్నీ థండర్ జట్టు తమ 15వ బీబీఎల్ సీజన్ కోసం అశ్విన్‌ను తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీని ద్వారా బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న అత్యంత ప్రసిద్ధ, సీనియర్ భారతీయ ఆటగాడిగా రవిచంద్రన్ అశ్విన్ ఘనత సాధించారు. బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న మొదటి భారతీయ ఆటగాడు అశ్విన్ అని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఆ గౌరవం భారత అండర్-19 జట్టు మాజీ కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ కు దక్కుతుంది. ఉన్ముక్త్ చంద్ భారత క్రికెట్ నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత, 2021-22 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరపున ఆడాడు. ప్రస్తుతం ఉన్ముక్త్ చంద్ అమెరికా కోసం క్రికెట్ ఆడుతున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఐపీఎల్‌తో సహా భారత క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి పదవీ విరమణ చేసిన ఆటగాళ్లు మాత్రమే విదేశీ టీ20 లీగ్‌లలో పాల్గొనడానికి అర్హులు. ఈ విధంగా చూస్తే, భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తర్వాత బిగ్ బాష్ లీగ్‌లో చేరిన రెండో భారతీయ ఆటగాడు, అత్యంత ప్రముఖ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్. రవిచంద్రన్ అశ్విన్ గతేడాది డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి, గత నెలలో ఐపీఎల్ టోర్నమెంట్ నుంచి తన రిటైర్మెంట్‌ను ప్రకటించారు. ఈ రిటైర్మెంట్ నిర్ణయమే అతనికి విదేశీ లీగ్‌లలో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. 38 ఏళ్ల అశ్విన్ తన 221 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌తో




సహా ఐదు జట్ల తరఫున ఆడి 187 వికెట్లు తీశారు. అంతర్జాతీయ స్థాయిలో 287 మ్యాచ్‌లలో 765 వికెట్లు పడగొట్టి, టెస్ట్ క్రికెట్‌లో 537 వికెట్లతో ప్రపంచంలో 7వ ప్రముఖ బౌలర్‌గా నిలిచారు. ఈ కొత్త ఒప్పందం గురించి రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. "సిడ్నీ థండర్ జట్టు నన్ను ఎలా ఉపయోగించుకోబోతున్నారనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారు. నన్ను ఆడించే విషయంలో వారికి ధైర్యం కూడా ఉంది. ఆ జట్టు నాయకులతో నేను జరిపిన సంభాషణలు చాలా బాగున్నాయి. డేవిడ్ వార్నర్ ఆడే విధానం నాకు చాలా ఇష్టం, మన కెప్టెన్ కూడా మనలాగే ఆలోచించడం ఎల్లప్పుడూ మంచి విషయం. థండర్ అభిమానుల కోసం నా అత్యుత్తమ ఆటను ప్రదర్శించడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. సిడ్నీ థండర్ జనరల్ మేనేజర్ ట్రెంట్ కోప్లాండ్ మాట్లాడుతూ, "అశ్విన్ సిడ్నీ థండర్ జట్టును ఎంచుకోవడం నాకు చాలా గర్వంగా ఉంది. అతని ఉత్సాహం, విజయం సాధించాలనే కోరిక మమ్మల్ని ఆకర్షించాయి. టోర్నమెంట్ మధ్యలో అతని ప్రపంచ స్థాయి బౌలింగ్ జట్టుకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఒక నాయకుడిగా, మార్గదర్శకుడిగా యువ ఆటగాళ్లకు అతని అనుభవం వెలకట్టలేనిది. పశ్చిమ సిడ్నీలో వేగంగా పెరుగుతున్న భారతీయ సమాజంతో అశ్విన్ అనుబంధం మాకు కొత్త అభిమానులను సృష్టిస్తుంది" అని అన్నారు. అశ్విన్ సిడ్నీ థండర్ జట్టులో డేవిడ్ వార్నర్, లాకీ ఫెర్గూసన్, సామ్ బిల్లింగ్స్, పాకిస్తాన్ ఆటగాడు షదాబ్ ఖాన్ వంటి స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడనున్నారు.

**సిడ్నీ థండర్ స్క్వాడ్:**

వెస్ అగర్, టామ్ ఆండ్రూస్, రవిచంద్రన్ అశ్విన్ (భారత్), కామెరూన్ బాన్‌క్రాఫ్ట్, సామ్ బిల్లింగ్స్ (ఇంగ్లాండ్), ఓలి డేవిస్, లాకీ ఫెర్గూసన్ (న్యూజిలాండ్), మాథ్యూ గిల్క్స్, క్రిస్ గ్రీన్, ర్యాన్ హాడ్లీ, షదాబ్ ఖాన్ (పాకిస్తాన్), సామ్ కోన్‌స్టాస్, నాథన్ మెక్‌ఆండ్రూ, బ్లేక్ నికితారాస్, డేనియల్ సామ్స్, తన్వీర్ సంఘా, డేవిడ్ వార్నర్.



# జయం రవికి మరో షాక్

## ఇంటిని వేలం వేయనున్న బ్యాంకు

తమిళ నటుడు జయం రవి(రవి మోహన్) మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇప్పటికే తన భర్య ఆర్తితో విడాకుల వివాదం కోర్టులో నడుస్తుండగా.. తాజాగా అతడి ఇల్లు వివాదంలో చిక్కుకుంది. చెన్నైలోని ఇంజంబక్కంలో ఉన్న ఆయన ఇంటిని వేలం వేయడానికి బ్యాంకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ ఇంటికి సంబంధించి జయం రవి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ప్రైవేటు బ్యాంక్ అధికారులు ఆయన ఇంటికి వేలం నోటీసులను అంటించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త కోలీవుడ్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. జయం రవి తన ఇంటి కోసం ఒక ప్రైవేటు బ్యాంక్ నుంచి పెద్ద మొత్తంలో గృహ రుణం తీసుకున్నట్లు సమాచారం. ఈ రుణానికి సంబంధించిన నెలవారీ ఈఎంఐలను ఆయన చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి సుమారు రూ.7.60 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయినట్లు బ్యాంకు జారీ చేసిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఈ రుణం చెల్లించమని బ్యాంక్ యాజమాన్యం గతంలో పలుమార్లు జయం రవికి నోటీసులు పంపించింది. కానీ వాటికి జయం రవి స్పందించకపోవడంతో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ కింద ఈ ఇంటిని వేలం వేసి తమ బకాయిలను వసూలు చేసుకోవడానికి బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది.

# షారూక్ ఖాన్‌పై పరువునష్టం కేసు



మాజీ నార్కోటిక్స్ ఆఫీసర్ సమీర్ వాంఖడే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ ద బాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో పాటు నటుడు షారూక్ ఖాన్‌పై ఆయన పరువు నష్టం కేసు వేశారు. ఆర్యన్ ఖాన్ డైరెక్ట్ చేసిన వెబ్‌సిరీస్‌లో నార్కోటిక్స్ ఆఫీసర్ పాత్రను తప్పుగా చూపించినట్లు ఆయన ఆరోపించారు. షారూక్‌తో పాటు రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ నుంచి వాంఖడే రెండు కోట్ల నష్టపరిహారాన్ని కోరాడు. తనకు వచ్చే నష్టపరిహారాన్ని టాటా మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆ వెబ్ సిరీస్‌లో యాంటీ డ్రగ్ ఎన్‌పోర్స్‌మెంట్ ఏజెన్సీలను నెగటివ్ పాత్రలో చూపించినట్లు ఆరోపించారు. ప్రజా వ్యవస్థలపై విశ్వాసం కోల్పోయే రీతిలో ఆ సిరీస్ ఉన్నట్లు పేర్కొన్నారు. ద బాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సిరీస్‌లో ఓ క్యారెక్టర్‌ను సమీర్ వాంఖడే ప్రేరణతో తీశారు. బాలీవుడ్ పార్టీ జరుగుతున్న ప్రదేశానికి వచ్చిన ఆ ఆఫీసర్ ఎవరు డ్రగ్స్ తీసుకుంటున్నారో ఆరా తీస్తాడు. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ఆ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. సమీర్ వాంఖడే గౌరవానికి భంగం కలిగించే రీతిలో కావాలనే పాత్రను సృష్టించారని వాంఖడే తన స్టేట్మెంట్‌లో తెలిపారు. సమీర్ వాంఖడే, ఆర్యన్ ఖాన్‌కు చెందిన కేసు ప్రస్తుతం ముంబై హైకోర్టులో ఉందని వాంఖడే వాంగ్మూలం ద్వారా తెలిసింది. 2021, అక్టోబర్ 3వ తేదీన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆర్యన్ ఖాన్, అయాజ్ మర్చెంట్, మున్మున్ దమేచాను అరెస్టు చేసింది. నిషేధిత డ్రగ్స్‌ను కలిగి ఉన్నట్లు, అమ్ముతున్నట్లు కేసు బుక్ చేశారు. ఓ క్రూయిజ్ షిప్‌ను రెయిడ్ చేసిన తర్వాత ఆ షిప్‌లో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 20 మందిని అరెస్టు చేశారు. ఆ కేసు దర్యాప్తును సమీర్ వాంఖడే చూశాడు. ఆర్యన్ ఖాన్25 రోజుల పాటు జైలుశిక్ష అనుభవించాడు. ఆ తర్వాత బెయిల్ దొరికింది. 2022, మే నెలలో ఆర్యన్ ఖాన్‌పై ఉన్న కేసుల్ని కొట్టిపారేశారు. నార్కోటిక్స్ ఆఫీసర్ వాంఖడేను బ్లాక్‌మెయిల్ ఆరోపణల కింద విధుల నుంచి తొలగించారు.




# ఆ టాలీవుడ్ హీరో వల్లే సాధ్యం..

## డాన్స్ పెర్ఫార్మన్స్ పై తమన్నా కామెంట్స్!

అల్లు అర్జున్ ని డాన్స్ లో బీట్ చేసేవారు ఎవరు లేరు అంటారు ఆయన అభిమానులు. అల్లు అర్జున్ డాన్స్ మూమెంట్స్ ప్రతి ఒక్క సినిమాలో చాలా అద్భుతంగా ఉంటాయి. ఎంతోమంది ఈయన డ్యాన్స్ చూసే అభిమానులుగా మారతారు.అయితే అలాంటి అల్లు అర్జున్ కారణంగానే తాను కూడా డ్యాన్స్ లో పర్ఫెక్షన్ నేర్చుకున్నాను అంటోంది ఓ హీరోయిన్. ఆమె ఎవరో కాదు తమన్నా.. రీసెంట్ గా తమన్నా పలు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేస్తూ తన డాన్స్ తో ఆకట్టుకుంటుంది. అయితే తనకి డ్యాన్స్ ఇంత పర్ఫెక్ట్ గా రావడానికి కారణం అల్లు అర్జున్ అంటూ తాజా ఇంటర్వ్యూలో బయటపెట్టింది. తమన్నా ఇటీవల తాను నటించిన 'డు యూ వన్నా పార్ట్నర్' అనే వెబ్ సిరీస్ ప్రమోషన్స్ లో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నేను అల్లు అర్జున్ కారణంగానే డాన్స్ లో ఉండే నైపుణ్యాలను నేర్చుకున్నాను. బద్రీనాథ్ సినిమా చేసే సమయంలో అల్లు అర్జున్ నన్ను చాలా ఎంకరేజ్ చేశాడు. ఆయన నుండే నేను డాన్స్ పర్ఫెక్షన్ నేర్చుకున్నాను. అల్లు అర్జున్ ఇచ్చిన సలహా.. డ్యాన్స్ ను మెరుగుపరచడంలో సహాయపడింది. అందుకే సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేయడానికి కూడా ఒప్పుకుంటున్నాను" అంటూ తెలియజేసింది. అలా అల్లు అర్జున్ కారణంగా డాన్స్ లో ఉండే పర్ఫెక్షన్ నేర్చుకున్న తమన్నా.. ఇలా ఎన్నో సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేస్తూ అలరిస్తోంది. ముఖ్యంగా చాలామంది తమన్నా అభిమానులు ఆమెని సినిమాలో కీ రోల్ లో చూడడం కంటే.. సినిమాలో స్పెషల్ సాంగ్ లో చూడడానికే ఇష్టపడుతున్నారు. అందుకే చాలామంది దర్శక నిర్మాతలు కూడా ఫ్యాన్స్ కోరిక మేరకు తమన్నాని ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో తీసుకుంటున్నారు. అలా రీసెంట్గా బాలీవుడ్ లో వచ్చిన స్త్రీ 2 మూవీలో "ఆజ్ కీ రాత్" పాటతో సంచలనం సృష్టించడమే కాకుండా తాజాగా షారుక్ ఖాన్ తనయుడు తీసిన వెబ్ సిరీస్ లో "గఫూర్" అనే స్పెషల్ సాంగ్ తో అందరినీ ఆకట్టుకుంది. అలాగే కోలీవుడ్లో రజినీకాంత్ నటించిన జైలర్ మూవీలో "నువ్వు కావాలయ్యా" అనే పాటతో సౌత్ ఇండస్ట్రీని షేక్ చేసింది తమన్నా. అలా తన డ్యాన్స్ స్టెప్పులతో అందరినీ అలరిస్తూ వరుస ఆఫర్స్ అందుకుంటుంది..



# హాట్ ఫోజులతో జాన్వీ

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తాజాగా సాంప్రదాయ దుస్తులతో మెరిసింది. జాన్వీ కపూర్ లేటెస్ట్ లుక్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఈ ఫోటోలు పంచుకోవడంతో పాటు అభిమానులకు నవరాత్రి శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. జాన్వీ కపూర్ నుండి రాబోయే తాజా మూవీ 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారి'.. ఈ సినిమా చిత్ర యూనిట్ తో కలిసి జాన్వీ కపూర్ దిగిన కొన్ని అద్భుతమైన ఫోటోలని తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోలలో జాన్వీ కపూర్ తో పాటు చిత్రయూనిట్ అందరూ ట్రెడిషనల్ డ్రెస్సులు వేసుకొని కనిపించారు. అలాగే ఈ ఫోటోకి క్యాప్షన్ గా "నవరాత్రి శుభాకాంక్షలు" అంటూ రాసుకోచ్చింది. సాంప్రదాయమైన దుస్తులు ధరించిన జాన్వీ కపూర్ ఆ లుక్ లో చాలా అద్భుతంగా కనిపించింది.. సాంప్రదాయ దుస్తుల్లో కూడా హార్ట్ ఫోజులు ఇచ్చింది అంటూ కొంతమంది ఫాలోవర్స్ కామెంట్లు చేస్తున్నారు.

# సమంత వాచ్ ధర అంత ఉంటుందా..?

తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో తన నటనతో పాటు స్టైలిష్ ఫ్యాషన్ సెన్సేషన్‌గా నిలిచిన అందాల తార సమంత తాజాగా కొత్త లగ్జరీ వాచ్ ధరించి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఇటీవల సమంత సినిమాల కన్నా కూడా బ్రాండ్లని ప్రమోట్ చేస్తూ ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. తాజాగా ఒక లగ్జరీ వాచ్ ను ధరించిన సామ్ అందుకు సంబంధించిన ఫొటోలను షేర్ చేయగా,ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.అయితే సమంత ధరించిన ఆ వాచ్ అందరి దృష్టిని ఆకర్షించగా, అది ఏ కంపెనీది..? దాని ధర ఎంత ? అంటూ గూగుల్ లో ఆరా తీస్తున్నారు . ఈ క్రమంలో సమంత ధరించిన వాచ్ ట్రాపేజ్డ్ ఆకారంలో ఉండే పియాజెట్ 60 జువెలరీ వాచ్ కాగా , దీని రేటు సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. ఇది తెలుసుకున్న నెటిజన్లు అవాక్కవుతున్నారు. గతంలోనూ సమంత పలు స్టైలిష్ అండ్ లగ్జరీ వాచెస్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె ఎక్కువగా బల్గారీ సర్పెంటీ వాచ్ (రూ. 45 లక్షలకు పైగానే) ధరించి కనిపిస్తుంటుంది. మొత్తానికి సమంత ఈ కొత్త వాచ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న "మా ఇంటి బంగారం" సినిమాలో నటిస్తోంది. అంతేకాదు, రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతోన్న వెబ్ సిరీస్ "రక్త బ్రహ్మాండ్" లోనూ సమంత తన నటనా ప్రతిభను చాటేందుకు కృషి చేస్తుంది. ఇకపోతే సమంత–రాజ్ జంట ప్రేమ వ్యవహారం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబై బాంద్రాలోని ఓ జిమ్ నుంచి కలిసి బయటకు రావడం, ఒకే కారులో వెళ్లిపోవడం వంటివి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తుందని, త్వరలోనే వివాహం చేసుకోవడం ఖాయం అని అంటున్నారు. కొన్నాళ్లుగా వీరి రిలేషన్ గురించి అనేక వార్తలు వస్తున్నా కూడా సమంత కాని, రాజ్ కాని స్పందించింది లేదు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**